
*Licensed to post with payment at RMS, Hyd*

*Regn. No. 87195 (APTEL/2005/14638)*

# ఉద్భవ

స్త్రీ మరియు పిల్లల సంక్షేమం / స్వేచ్ఛ / హక్కుల మాసపత్రిక

Volume : 18
Issue: 7
October 2024
Pages: 72 Rs.10




## చిన్నారులకు పౌష్టికాహారం.. శారీరక, మానసిక ఎదుగుదలకు అత్యవసరం



## ఢిల్లీ సీఎంగా ఆతిశీ సింగ్



## ఇది హాస్టలా.. జైలా..?!

కార్పొరేట్ కాలేజీలపై మహిళా కమిషన్ ఆగ్రహం

## టాలీవుడ్‌లోనూ లైంగిక వేధింపులు

కొరియోగ్రాఫర్ జానీ అరెస్టు





నో నైట్‌షిఫ్ట్ పాలసీ సరికాదు

## మహిళల రక్షణ ప్రభుత్వాల బాధ్యత

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ స్పష్టీకరణ

**UDBHAVA**

Edited, Printed, Published and owned by
**Dr. M. Madhava Vasu**
Published at 1-24-21/4, (24-387), Plot No.1,
Sri Sai Nagar, Lothukunta, Alwal,
Secunderabad - 500 015, Telangana, India.
Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com

**Printed at Saraswathi Printers,**
1-24-21/4, Plot No.1, Sri Sai Nagar, Lothukunta,
Alwal, Secunderabad - 500 015.

AIMS HUMAN RIGHTS SOCIETY SURVEY

# ఉద్భవ

**స్త్రీ మరియు పిల్లల సంక్షేమం / స్వేచ్ఛ / హక్కుల మాస పత్రిక**

Regn. No. 87195 (APTEL/2005/14638)

**Volume:18 Issue: 7 * October 2024 * Pages: 72 Rs.10**



Founder and Editor in Chief

**Dr. M. Madhava Vasu**

M.A., M.H.R., M.Phil (JMC), P.G.H.R., Ph.D., F.D.R. (Nalsar), B.P.R., DEE.

**Advisors:**

**Sri M. Madhusudhan Reddy**
Advocate

**Sri P. Balreddy**
Advocate

**Sri S. Mohan Rao**
Journalist

Kakinada Correspondent :
**Sri D. Venugopal Rao**


## లోపలి పేజీల్లో...


- మహిళల రక్షణ ప్రభుత్వాల బాధ్యత 3
- రోజుకు వంద గుంజీలు 8
- ఇది హాస్టలా.. జైలా...?! 9
- కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ అరెస్టు 12
- బద్లాపూర్ లైంగికదాడి నిందితుడి ఎన్‌కౌంటర్ 19
- మూడేళ్లలో 13.13లక్షల మంది మహిళలు మిస్సింగ్! 23
- గర్భాశయ క్యాన్సర్‌కు భారత్‌లో వ్యాక్సిన్ తయారీ 25
- ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆతిశీ మార్లినా సింగ్ 29
- హక్కుల ఉద్యమకారిణి హరిణి 34
- అఫ్గాన్ మహిళల నోటికి తాలిబన్ల 'తాళం' 36
- జైళ్లలో కులవివక్ష? 45
- సురక్షిత గర్భం, శిశు జననానికి పౌష్టికాహారమే ఔషధం 61



**UDBHAVA**
Edited, Printed, Published and owned by **Dr. M. Madhava Vasu**
Published at 1-24-21/4, (24-387), Plot No.1, Sri Sai Nagar, Lothukunta, Alwal, Secunderabad - 500 015, Telangana, India. Phone: 040-27960130 - Mobile : +91 9848861801
email: madhavvasumanchiraju@gmail.com


**UDBHAVA**
Carries proudly the messages of society of all sections of people, especially women and children, downtrodden section of peoples rights and deprivation of any Human Rights to any section of people.


**DISCLAIMER**
The views, opinions and expressions in various ariticles, NGO and are those of Authors, Human Rights Watch, different news papers and PTI are their respective views and stature of UDBHAVA holds no responsibility.



**ACKNOWLEDGEMENT OF THE SOURCE**
The National Human Rights Commission news letters, State Human Rights Commission Reports, Mahila Commission reports, Articles of the News Papers, PTI reports, Monthly Magazines, Books and International Human Rights Watch, Andhra Pradesh and Telangana State Governments Schemes for Women and Children.

## సంపాదకీయం

# మహిళలు శక్తిమంతులు

సహనానికి మారుపేరు మహిళ. ఒక శిశువును నవమాసాలు తన గర్భంలో మోసి జన్మనివ్వడం ఆమెకు పునర్జన్మే. నిజంగా చెప్పాలంటే శిశువుకు జన్మనిచ్చి తాను పునర్జన్మ పొందుతుంది. అంతటి శారీరక, మానసిక సామర్థ్యం కలిగిన మహిళ నైట్‌డ్యూటీలు చేయలేదనో, ఇతరత్రా కారణాలతోనో పగలు మాత్రమే చేయగలిగే అబలగా చిత్రీకరించేలా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతమాత్రం సహేతుకం కాదు. అన్ని రంగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న మహిళలు పగలు - రాత్రి భేదం లేకుండా విధులు నిర్వహించడం ఆధునిక యుగంలో మహిళలు సాధించుకున్న విజయం. ఉన్నత స్థానాలకు ఎదగాలని, తన రంగంలో విశేష ప్రతిభ కనబరచాలని కలలు కనే మహిళలకు పరిమితులు విధించడం ఎంతమాత్రం సబబు కాదు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న ఇలాంటి నిర్ణయాన్ని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదిలోనే తుంచివేయడం శుభపరిణామం. ఏ రంగంలో ఉన్న మహిళలకైనా వారికి రక్షణ కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని తేటతెల్లం చేయడం హర్షణీయం. భవిష్యత్తులో దేశంలో ఏ ప్రభుత్వమూ అలాంటి నిర్ణయం తీసుకోకుండా కట్టడి చేయగలిగింది. మహిళలు మినహాయింపులు కోరడం లేదని, సమాన అవకాశాలు కోరుతున్నారని, ఏ షిఫ్టులోనైనా పనిచేసి తమ సత్తా చాటుకునేందుకు వారు సంసిద్ధంగా ఉన్నారని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ చెప్పేవరకూ తెలుసుకోలేని స్థితిలో బెంగాల్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం దురదృష్టకరం. ఆర్‌జి కర్ ఆసుపత్రిలో మహిళా డాక్టర్ హత్యాచారం నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నా రాత్రివేళల్లో పని చేసే మహిళల పనిప్రదేశంలో రక్షణ కల్పించాల్సిన బాధ్యతనుంచి తప్పుకోవాలనుకోవడం బాధాకరం. అన్నివేళలా మహిళల అందిస్తున్న సేవలను ప్రజలకు చేరువ కావాలంటూ వారికి పటిష్టమైన రక్షణ వలయం కల్పించాల్సిన అవసరాన్ని ఏ ప్రభుత్వమూ విస్మరించకూడదు. మహిళలకు రక్షణ కల్పిస్తే వారికున్న సహజ సిద్ధమైన సహనం, నైపుణ్యం, నిర్వహణతో సేవలు మరింతగా అందుబాటులో ఉంటాయనడంలో సందేహం లేదు.

## 'నో నైట్‌షిఫ్ట్ పాలసీ' సరికాదు

# మహిళల రక్షణ ప్రభుత్వాల బాధ్యత



★ నైట్‌షిఫ్ట్ మహిళలకు మినహాయింపు కాదు

★ సమాన అవకాశాలు ఇవ్వాలి

★ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఆలోచనను తప్పుపట్టిన సుప్రీంకోర్టు సిజె చంద్రచూడ్



ప్రభుత్వ ఆసుపత్రుల్లో మహిళా వైద్యులు, సిబ్బందికి రాత్రిపూట విధుల్లో నియమించవద్దని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మహిళలు రాత్రివేళల్లో పనిచేయలేరని ఎలా చెబుతారని, ఇలాంటి పరిమితులు మహిళలకే ఎందుకని ఆయన ప్రశ్నించారు. మహిళలు మినహాయింపులు కోరడం లేదు, సమాన అవకాశాలు కావాలంటున్నారని, అన్ని షిఫ్టుల్లో పనిచేయడానికి వారు సిద్ధంగా ఉన్నారని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పష్టం చేశారు. రాత్రివేళల్లో పనిచేసే మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని ఆయన తేల్చిచెప్పారు. వారు నైట్‌డ్యూటీలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు, పైలట్లు, సైనికులు వంటి వారు రాత్రిపూట పనిచేస్తారు. రాత్రిపూట పనిచేయవద్దని చెప్పే అధికారం ఎవరికీ లేదు. వారికి రక్షణ కల్పించడమే మీ బాధ్యత, కర్తవ్యం అని చంద్రచూడ్ స్పష్టం చేశారు. పిటిషనర్ తరపున వాదిస్తున్న కపిల్ సిబల్‌ను ఉద్దేశించి ఇలాంటి నిర్ణయాన్ని మీరు ఎలా సమర్థిస్తారు? అని ప్రశ్నించారు. మహిళా వైద్యులు రాత్రిపూట విధులు

నిర్వర్తించేందుకు అనువైన వాతావరణం లేకపోతే వారి భవిష్యత్తుకు తీవ్ర విఘాతం కలుగుతుంది. దీనికి కపిల్ సిబల్ బదులిస్తూ ఈ అంశాన్ని తొలగిస్తామని సిజెఐ చంద్రచూడ్‌కు హామీ ఇచ్చారు.

కాగా, ఆర్‌జి కర్ ఆసుపత్రిలో జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా గత 40 రోజులుగా వైద్య విద్యార్థులు ఆందోళన జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో వైద్య విద్యార్థులతో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ చర్చలు జరిపారు. ఆరు గంటల పాటు ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన చర్చల్లో 42మంది వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ చర్చల్లో భాగంగా ఐదు డిమాండ్లను తీసుకువచ్చారు. అయితే ఇదే సమయంలో మహిళా వైద్యులకు నైట్‌డ్యూటీలు వేయకుండా నోటిఫికేషన్ విడుదలైంది.

ఆసుపత్రుల్లో మహిళలకు రక్షణ కరువైందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారు అలపన్ బందోపాధ్యాయ మహిళా వైద్యుల భద్రతకు భరోసా ఇచ్చేందుకు మార్గదర్శకాలను ప్రకటించారు. అన్ని వైద్య కళాశాలలు, ఆసుపత్రుల వద్ద మహిళలకు భద్రతను కల్పిస్తామన్నారు. వైద్యకళాశాలలు, ఆసుపత్రుల వద్ద స్థానిక పోలీసులతో రాత్రిపూట పెట్రోలింగ్ నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. రాత్రిపూట విధులు నిర్వహించే మహిళా వైద్యులు జంటగా పనిచేసే విధంగా షిఫ్టులు వేస్తామని తెలిపారు.

కోల్‌కతా మహిళా వైద్యురాలి హత్యాచార ఘటనను సుమోటోగా తీసుకున్న సుప్రీంకోర్టు విచారణను కొనసాగిస్తూ హతురాలి పేరు, ఫొటోను తొలగించాల్సిందిగా వికీపీడియాను మరోసారి ఆదేశించింది. ఆర్‌జి కర్ ఆస్పత్రిలో జరిగిన ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు చేస్తున్న సిబిఐని స్టేటస్ రిపోర్టు సమర్పించాలని ఆదేశించింది. హత్యాచార ఘటనకు బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి పదవికి మమతా బెనర్జీని రాజీనామా చేయాలని ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇది రాజకీయ వేదిక కాదంటూ పిటిషనర్‌ను ఈ సందర్భంగా మందలించింది.

*మహిళలు మినహాయింపులు కోరడం లేదు, సమాన అవకాశాలు కావాలంటున్నారని, అన్ని షిఫ్టుల్లో పనిచేయడానికి వారు సిద్ధంగా ఉన్నారు. రాత్రివేళల్లో పనిచేసే మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. వారు నైట్‌డ్యూటీలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు, పైలట్లు, సైనికులు వంటి వారు రాత్రి పూట పనిచేస్తారు. రాత్రిపూట పనిచేయవద్దని చెప్పే అధికారం ఎవరికీ లేదు. వారికి రక్షణ కల్పించడమే మీ బాధ్యత, కర్తవ్యం' అని చంద్రచూడ్ స్పష్టం చేశారు.*

# బెంగాల్‌లో మరో దారుణం



కోల్‌కతా ఆసుపత్రిలో వైద్యురాలిపై హత్యాచార ఘటనను మరువకముందే బెంగాల్‌లో మరో దారుణం వెలుగుచూసింది. కోచింగ్ క్లాస్‌కు వెళ్లిన 11 ఏళ్ల బాలిక అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం కలకలం రేపుతోంది. బాలికను కిడ్నాప్ చేసి హత్య చేసి ఉంటారని అనుమానాలు రావడంతో స్థానికుల నుంచి ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తాయి. ఘటనకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నిరసనలు చేపట్టారు. 24 పరగణాల జిల్లాలో ఈ ఘోరం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం 11 ఏళ్ల బాలిక కోచింగ్ క్లాస్‌కు శుక్రవారం ఇంటి నుంచి వెళ్లింది. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక కోసం గాలిస్తున్న క్రమంలో శనివారం తెల్లవారుఝామున 3.30 గంటల సమయంలో ఓ పొలంలో బాలిక మృతదేహం కనిపించింది. ఒంటి నిండా గాయాలు ఉండటంతో కిడ్నాప్ చేసి హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ దారుణానికి ఒడిగట్టినట్లు అనుమానిస్తున్న మోస్తకిన్ సర్దార్ అనే 19 ఏళ్ల యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి, రిపోర్టుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## అత్యాచారాన్ని ప్రతిఘటించి... ప్రాణాలు కోల్పోయిన బాలిక

ఈ కేసులో అరెస్టయిన నిందితుడు మోస్తకిన్ సర్దార్ బాలికను తానే హత్య చేసినట్లు ఒప్పుకున్నాడు. బాలికను అత్యాచారం చేసేందుకు ప్రయత్నించానని, తీవ్రంగా ప్రతిఘటించడంతో ఆమెను చంపేసినట్లు విచారణలో వెల్లడించాడు. మృతదేహాన్ని సమీపంలోని కాలువలో పారేసినట్లు తెలిపారు. చాలారోజులుగా నిందితుడు అమ్మాయితో స్నేహం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని, ఆమెకు ఐస్క్రీం ఆఫర్ చేస్తున్నట్లు కూడా విచారణలో తేలింది. బాలికను అత్యాచారం చేసి హత్య చేశాడని స్థానికులు కొందరు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనను తీవ్రంగా నిరసిస్తూ లాఠీలు, చీపుర్లు, ఆయుధాలతో నిరసనకారులు ఆందోళన చేపట్టారు.

# గణేశ్ నిమజ్జన శోభాయాత్రలో చెలరేగిన 996మంది పోకిరీలు

## ★ వీడియోలు, ఫొటోలతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న షి-టీమ్స్

## ★ కొందరు కోర్టుకి.. మరికొందరికి కౌన్సెలింగ్

హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన గణేశ్ నిమజ్జనం, శోభాయాత్రలో షి-టీమ్స్ పోలీసులు మఫ్టీలో రంగంలోకి దిగి మహిళలు, చిన్నారులకు భద్రత కల్పించారు. డిసిపి కవిత పర్యవేక్షణలో షి-టీమ్స్ ఆధ్వర్యంలో సిటీ కమిషనరేట్ పరిధిలో 12 బృందాలతో పాటు ప్రతి పోలీసుస్టేషన్ నుండి ముగ్గురేసి చొప్పున సుమారు 200మంది పోలీసులు పహారా కాశారు. మహిళల పట్ల వికృత చేష్టలకు పాల్పడిన 996మంది పోకిరీలను పట్టుకుని కేసులు నమోదు చేశారు. మహిళలు, యువతులు, బాలికలపై కొంతమంది పోకిరీలు, ఆకతాయిలు కావాలనే అసభ్యంగా ప్రవర్తించడం, తాకరాని చోట తాకడం, ఎవరూ చూడటం లేదనుకుని మహిళలపట్ల ఇష్టానుసారంగా ప్రవర్తించడం వంటి చర్యలకు పాల్పడుతుండటాన్ని షి-టీమ్స్ పోలీసులు ఫొటోలు, వీడియోలతో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారిలో నేర తీవ్రతను బట్టి సాక్ష్యాధారాలతో న్యాయస్థానంలో హాజరుపరిచారు. 200మంది పోకిరీలకు న్యాయస్థానం మూడు రోజుల జైలుశిక్ష, రూ.1050 జరిమానా విధించినట్లు షి టీమ్స్ డిసిపి కవిత వెల్లడించారు. మిగిలిన పోకిరీలకు వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో వీడియోలను చూపించి కౌన్సెలింగ్ నిర్వహించి కఠినమైన వార్నింగ్ ఇచ్చినట్లు తెలిపారు. పోకిరీలు, ఆకతాయిల వికృత చేష్టలవల్ల ఇబ్బందులు పడే బాధిత మహిళలు డయల్ -100 లేదా సిటీ పోలీసు కమిషనరేట్ వాట్సప్ నెంబర్ 9490616555కు ఫోన్ చేయవచ్చు. బాధిత మహిళల వివరాలను గోప్యంగా ఉంచుతామని కవిత వివరించారు.




అడుగడుగునా పోకిరీల బెడద..
పెరుగుతున్న వేధింపుల రొద

**డయల్ -100 లేదా సిటీ పోలీసు కమిషనరేట్ వాట్సప్ నెంబర్ 9490616555**

# ప్రతి మహిళకూ గృహహింస చట్టం వర్తిస్తుంది

## సుప్రీంకోర్టు స్పష్టీకరణ

మతం, సామాజిక నేపథ్యంతో ఏమాత్రం సంబంధం లేకుండా ప్రతి ఒక్క మహిళకూ గృహహింస చట్టం వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ నేతృత్వంలోని ధర్మాసనం గృహహింస చట్టం ప్రతి మహిళ హక్కులను పరిరక్షిస్తుందని స్పష్టం చేసింది. భరణం, పరిహారానికి సంబంధించిన కేసులో కర్నాటక హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ ఓ మహిళ దాఖలు చేసిన అప్పీల్‌పై కోర్టు తీర్పును వెలువరించింది. చట్టంలోని సెక్షన్ 12 కింద సదరు మహిళ పిటిషన్ దాఖలు చేసింది. అంతకుముందు 2015 ఫిబ్రవరిలో మేజిస్ట్రేట్ కోర్టు మహిళకు నెలకు 12వేలు, లక్ష పరిహారం చెల్లించాలని ఆమె భర్తను ఆదేశించింది. ఆ తీర్పుపై మహిళ భర్త అప్పీల్ దాఖలు చేశారు. చట్టంలోని సెక్షన్ 25కింద ఆర్డర్‌ను మార్చాలని అతను మేజిస్ట్రేట్‌కు విజ్ఞప్తి చేయగా ఆ అభ్యర్థనను తిరస్కరించింది. దాంతో అతను అప్పీల్ కోర్టుకు వెళ్లగా అంగీకరించింది. ఇద్దరూ సాక్ష్యాలను సమర్పించాలని ఇరు వర్గాలను ఆదేశించింది. దీంతో మహిళ హైకోర్టుకు వెళ్లగా పిటిషన్‌ను తిరస్కరించింది. భర్త దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించాల్సిందిగా మేజిస్ట్రేట్‌ను ఆదేశించింది. చట్టంలోని నిబంధనల ప్రకారం ఇచ్చిన ఆర్డర్‌లో మార్పు, సవరణలతో పాటు రద్దుచేయాలని కోరవచ్చని స్పష్టంగా ఉందని చెప్పింది. ఈ సందర్భంగా సెక్షన్ 25ని కోర్టు ప్రస్తావించింది. పరిస్థితుల్లో మార్పు వచ్చిన సమయంలోనే అది సాధ్యమవుతుందని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది.



# రోజుకు వంద గుంజీలు

★ ప్రిన్సిపాల్ పైశాచిక క్రమ'శిక్ష'ణ

★ తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థినులు

★ ఆంధ్రప్రదేశ్ అల్లూరి జిల్లా రంపచోడవరంలో దారుణం



ఆంధ్రప్రదేశ్ అల్లూరి జిల్లా రంపచోడవరంలోని ఏపిఆర్ బాలికల జూనియర్ కళాశాలలో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. క్రమశిక్షణ పేరుతో ప్రిన్సిపాల్, ఫిజికల్ డైరెక్టర్ ఇద్దరూ కలిసి తాము చెప్పిన మాట వినడం లేదనే సాకుతో మూడు రోజుల పాటు వరుసగా రోజుకు వంద గుంజీలు తీయించారు. ఇంటర్ మొదటి, రెండు సంవత్సరం చదువుతున్న 50 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కొందరు బాలికలు నడవలేని స్థితికి చేరుకున్నారు. తల్లిదండ్రులకు సమాచారం అందడం వారు కాలేజీకి చేరుకుని పిల్లలను ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. నడవలేని స్థితిలో ఉన్న బాలికలను మోసుకెళ్తున్న వీడియోలు వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై ఎమ్మెల్యే శిరీష స్పందిస్తూ క్రమశిక్షణ పేరుతో విద్యార్థినుల చేత గుంజీలు తీయించడం దారుణమైన చర్య అన్నారు. విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఐటిడిఏ పిఓను ఆదేశించారు. సమగ్ర దర్యాప్తు జరిపి నిర్ణీత గడువులోగా పూర్తిచేసి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. స్థానిక ఏరియా ఆసుపత్రికి వెళ్లి బాలికలను పరామర్శించారు. వారినుంచి మరిన్ని వివరాలు సేకరించారు. ఏదైనా సమస్య ఉంటే తనతో చెప్పాలని బాలికలకు ఆమె భరోసా ఇచ్చారు. ఇకనుంచి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

# ఇది హాస్టలా.. జైలా...?!

★ కార్పొరేట్ కాలేజీల్లో తెలంగాణ మహిళా కమిషన్ ఆకస్మిక తనిఖీలు

★ విద్యార్థినుల సౌకర్యాలపై ఆగ్రహించిన చైర్‌పర్సన్ శారద





కార్పొరేట్ కాలేజీలు ప్రచారం చేసుకున్నంత స్థాయిలో సౌకర్యాలు మాత్రం ఉండవనేది తేట తెల్లమైంది. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా సౌకర్యాల విషయంలో మాత్రం విద్యార్థినులకు చుక్కలు చూపిస్తున్నారు. సాధారణ హాస్టల్ మాదిరిగా కూడా అక్కడ సౌకర్యాలు ఉండవనేది విద్యార్థినులు ధైర్యం చేసి ఫిర్యాదు చేస్తే గానీ బయటపడలేదు. సౌకర్యాల విషయంలో విసిగి పోయిన బాచుపల్లి నారాయణ కాలేజీ విద్యార్థినులు ఎలాంటి భయం లేకుండా ముందుకొచ్చి సమస్యలపై ఫిర్యాదు చేశారు. తల్లి దండ్రులతో కలిసి తమ సమస్యలని అధికారుల దృష్టికి తీసుకువె ళ్లారు. దీంతో ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఏమాత్రం ఆలస్యం చేయకుండా రంగంలోకి దిగారు. బాచుపల్లి నారాయణ కాలేజీని

మహిళా కమిషన్ ఫోన్ నెం.
9490555533
లేదా 181కు ఫోన్ చేసి
ఫిర్యాదు చేయండి.

ఆకస్మికంగా తనిఖీకి వెళ్లి యాజమాన్యానికి గట్టి షాక్ ఇచ్చారు. కాలేజీలోకి అడుగుపెట్టగానే శారద విద్యార్థినుల హాస్టళ్లను సందర్శించారు. అక్కడి సౌకర్యాలు చూసి ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మెస్‌లో ఫుడ్ క్వాలిటీ సరిగా లేదు. హాస్టల్ గదుల పరిస్థితి అయితే ప్రత్యేకించి చెప్పనక్కర్లేదు. వాష్‌రూమ్‌ల పరిస్థితి కూడా అంతే. భరించలేని దుర్వాసన రాజ్యమేలుతోంది. వాష్ రూమ్‌ల డోర్లు సరిగా లేకపోగా కనీసం మగ్‌లు కూడా లేవు. వీటన్నింటినీ గమనించి చైర్‌పర్సన్ శారద ఒక్కసారిగా అవాక్కయ్యారు. బాలికలు ఎంత నరకయాతన పడుతున్నారో ఆమెకు పూర్తిగా అర్థమైంది. కాలేజీ యాజమాన్యంపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్‌వార్డెన్, కళాశాల ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. ఇది మనుషులు ఉండే స్థలమేనా అని ఆగ్రహించారు. ఉడికీ ఉడకని అన్నం పెడితే ఎలా జీర్ణమవుతుందని ప్రశ్నించారు. బాచుపల్లి బ్రాంచ్‌నుంచి ఇంకో బ్రాంచ్‌కు విద్యార్థినులను తక్షణం మార్చాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మీకు ఏవైనా సమస్యలుంటే నాకు కాల్ చేయండి. ఫిర్యాదు చేశారని ఎవరైనా వేధించినా నాకు సమాచారమివ్వండి అంటూ విద్యార్థినులకు తన ఫోన్ నెంబర్ ఇచ్చారు. మహిళా కమిషన్ ఫోన్ నెం - 9490555533 లేదా 181కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. బాలికల భద్రతపైనా రాజీపడే ప్రసక్తి లేదని చైర్‌పర్సన్ శారద స్పష్టం చేశారు.

## మాదాపూర్ శ్రీచైతన్య మహిళా కాలేజీలో విస్తుపోయే నిజాలు

మాదాపూర్ శ్రీచైతన్య మహిళా కాలేజీలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆకస్మిక తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూశాయి. అక్కడి పరిస్థితులు చూసి ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది విద్యార్థినుల హాస్టల్ మాదిరి లేదని, జైలులా ఉందని తీవ్ర స్థాయిలో అసహనం ప్రదర్శించారు. హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో వున్న శ్రీచైతన్య మహిళా కాలేజీలో ఇటీవల 100మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కాలేజీల్లో వసతులు సరిగా లేవని, వంటగదులు అపరిశుభ్రంగా ఉన్నాయని ఫిర్యాదులు వచ్చాయి. ఈ మేరకు ఫుడ్ సేఫ్టీ, జిహెచ్‌ఎంసి అధికారులు తనిఖీలు చేసి జరిమానా విధించారు. ఈ పరిణామాల అనంతరం కాలేజీలో పరిస్థితులను సమీక్షించడానికి మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆకస్మికంగా తనిఖీ జరిపారు. విద్యార్థుల తరగతి గదులు, హాస్టల్, వంటశాలను పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జరిమానా విధించినా పరిస్థితులు మారలేదని అర్థమైంది. వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సౌకర్యాలు లేకపోగా నాసిరకమైన ఆహారాన్ని పెడుతున్నారని యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. హాస్టల్ గదులు జైలు బారక్‌లను తలపిస్తున్నాయన్నారు. విద్యార్థుల నుంచి వసతులపై వివరాలు



అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలున్నా, యాజమాన్యం ఇబ్బంది పెట్టినా తమను సంప్ర దించాలని విద్యార్థినులకు శారద సూచించారు. అనంతరం శ్రీచైతన్య యాజమాన్యానికి సమన్లు జారీచేశారు. విద్యార్థినుల భద్రతపై రాజీపడే ప్రసక్తి లేదని, ఎవర్నీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. హాస్టల్ గదుల్లో కిటికీలు లేవని, గాలి వెలుతురు లేకపోతే ఎలా అని హాస్టల్ సిబ్బందిపై మండిపడ్డారు. భవనంపైనుంచి నీరు కారి భోజనంలో పడిందని విద్యార్థులు చెబితే ఏంకాదు తినమని సలహా ఇస్తారా? పశువులను పెట్టినట్లు ఇరుకుగదుల్లో ఎలాంటి వెంటిలేషన్ లేకుండా, చెత్తాచెదారంతో నిండిపోయాయని, మీరు ఇలాగే ఉండగలుగుతారా అని విరుచుకుపడ్డారు. ఐదు అంతస్తుల భవనంలోని అన్ని రూమ్‌లు ఇలా ఉన్నాయా అని ప్రశ్నించారు. విద్యార్థినులతో పాటు సిబ్బందిని ఆరునెలల పాటు ఈ హాస్టల్ గదుల్లో ఉంచితే అప్పుడు వారి ఇబ్బందులు అనుభవంలోకి వస్తాయన్నారు. కారణాలు చెప్పి తప్పించుకోవద్దని, వసతులు కల్పించకుండా విద్యార్థినులను ఇబ్బందులపాలు చేస్తారా అంటూ ప్రశ్నించారు. కాలేజీ ముందు నా కారు ఆగిన వెంటనే గేటు లోపల తాళం ఎందుకు వేశారో చెప్పాలని శారద గుచ్చిగుచ్చి సిబ్బందిని నిలదీశారు.

అలాగే, నిర్మల్ జిల్లా కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కాలేజీల్లోనూ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద ఆకస్మికంగా తనిఖీలు జరిపారు. విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారు లను ఆదేశించారు. రిజిస్టర్లను తనిఖీ చేసి విద్యార్థుల సంఖ్యపై ఆరాతీశారు.

## టాలీవుడ్‌లో లైంగిక వేధింపులు

# కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ అరెస్టు

★ పోక్సో కేసు నమోదు.. రిమాండ్‌కు తరలింపు

★ జాతీయ అవార్డు రద్దు



మలయాళ సినీ పరిశ్రమలో లైంగిక వేధింపులపై ఏర్పాటుచేసిన జస్టిస్ హేమా కమిటీ నివేదిక బయటికొచ్చినప్పటి నుంచి దేశవ్యాప్తంగా అన్ని సినీ పరిశ్రమల్లో జరుగుతున్న లైంగిక వేధింపులు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. సినీ వర్గాల్లోనే కాదు దేశవ్యాప్తంగా ఈ ఘటనలు తీవ్ర చర్చకు దారితీశాయి. గ్లామర్ ప్రపంచం కళ్లకు కనిపించేంత అందంగా ఉండదని, వారి కళ్ల వెనుక ఎన్నో విషాద గాథలు ఉన్నాయనే విషయం బయటపడుతున్నాయి. తాజాగా తెలుగు సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్‌ను లైంగిక వేధింపుల కేసులో పోలీసులు అరెస్టు చేశారు. తాను మైనర్‌గా ఉన్నప్పటినుంచే ఐదేళ్లుగా జానీమాస్టర్ తనను లైంగికంగా వేధిస్తున్నాడని, అతని మాట విననందుకు తనను చాలాసార్లు కొట్టాడని అతని వద్ద పనిచేస్తున్న మహిళా కొరియోగ్రాఫర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు జానీమాస్టర్‌ను అరెస్టు చేసేందుకు వెళ్లగా పోలీసులకు దొరక్కుండా పారిపోయాడు. చివరకు జానీని గోవాలో అరెస్టు చేసిన పోలీసులు పిటి వారెంట్ కింద హైదరాబాద్‌కు తీసుకువచ్చి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించారు.

బాధితురాలి ఫిర్యాదు మేరకు సైబరాబాద్‌లోని రాయదుర్గం పోలీసుస్టేషన్ జీరో ఎఫ్ఐఆర్ నమోదుచేశారు. సెప్టెంబర్ 15న నార్సింగి పోలీసులు ఐపిసి 376(2)(ఎన్), 506, 323 సెక్షన్ల కింద మళ్లీ కేసు నమోదు చేశారు. 2020లో ఉద్యోగరీత్యా ముంబైకి వెళ్లిన సమయంలో జానీమాస్టర్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, ఎవరికీ చెప్పవద్దని బెదిరించాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. సాధారణంగా తన తల్లి తనవెంటే ఉంటారని,

అయితే టికెట్లు అందుబాటులో లేనందున ఈసారి వెళ్లలేదని ఫిర్యాదులో వివరించింది. తనపై ఫిర్యాదు చేస్తే శారీరకంగా హింసిస్తానని బెదిరించాడని, ఫొటోషూట్‌లు, రిహార్సల్స్ సమయంలో తనను మానసికంగా వేధించాడని బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొంది. అంతే కాకుండా తనను మతం మారాలని, తనను పెళ్లి చేసుకోవాలని కూడా ఒత్తిడి తెచ్చాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేయగా, నేరం జరిగినప్పుడు ఆమె మైనర్ అని వెల్లడైంది. దీంతో పోక్సో చట్టం-2012లోని సెక్షన్ 5(1) రెడ్ విత్ 6 జోడించబడింది. నిందితుడు జానీమాస్టర్‌ను గోవాలోని స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ మీద హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. అనంతరం హైదరాబాద్‌లోని కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ అతనికి రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు. తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి (టిఎఫ్‌సిసి) జానీమాస్టర్‌ను చాంబర్ నుంచి బహిష్కరించింది. లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న జానీమాస్టర్ తనపై వచ్చిన ఆరోపణలను అంగీకరించినట్లు పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

## బెయిల్ మంజూరు.. అవార్డు రద్దు

నేషనల్ ఫిల్మ్ అవార్డుకు ఎంపికైన జానీమాస్టర్ లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన నేపథ్యంలో ఆ అవార్డును రద్దుచేస్తూ చలనచిత్ర అవార్డుల డైరెక్టరేట్ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 8న అతను ఈ అవార్డును అందుకోవాల్సి ఉండగా ఒకరోజు ముందు ఈ అవార్డును రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, ఈ అవార్డును తీసుకునేందుకు కోర్టు అనుమతి కోరగా అక్టోబర్ 6నుంచి 10వరకు మధ్యంతర బెయిల్ కూడా మంజూరు చేసింది. అయితే బెయిల్ మంజూరైనా అవార్డు రద్దు కావడం విశేషం.

## తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి
## 'లైంగిక వేధింపుల పరిష్కార కమిటీ' విచారణ

టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీమాస్టర్ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని మహిళా కొరియోగ్రాఫర్ ఆరోపించిన నేపథ్యంలో తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి 'లైంగిక వేధింపుల పరిష్కార కమిటీ' సభ్యులు విచారణ చేపట్టారు. ఎఫ్ఐఆర్ నమోదైన మరునాడు తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి ఏర్పాటుచేసిన లైంగిక వేధింపుల పరిష్కార కమిటీ ప్రతినిధులు మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలకు విరుద్ధంగా ప్రాణాలతో బయటపడిన వ్యక్తి యొక్క గుర్తింపును కొన్ని టెలివిజన్ మరియు సోషల్



మీడియా సంస్థలు వెల్లడించిన నేపథ్యంలో కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడారు. సినీ నటి, చైర్‌పర్సన్ ఝాన్సీతో పాటు పరిహార కమిటీ గౌరవ కార్యదర్శి కెఎల్ దామోదర్ ప్రసాద్, నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, నిర్మాత వివేక్ కూచిభొట్ల, నటుడు ప్రగతి మహావాది, సామాజిక సేవకురాలు రామలక్ష్మిమేడపాటి, న్యాయవాది కావ్య మండవ తదితరులు ఉన్నారు. పోలీసు విచారణతో పాటుగా కమిటీ సమాంతర దర్యాప్తు వేగవంతంగా జరుపుతోందని, 90 రోజుల్లో నివేదికను సమర్పించనున్నట్లు ప్యానెల్ ప్రకటించింది. నటి శ్రీరెడ్డి చేసిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో 2018లో లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్‌ను ఏర్పాటుచేశారు.

# కంప్లైంట్ బాక్స్

చిత్రపరిశ్రమలో ఎవరైనా లైంగిక వేధింపులకు గురిచేసినా, ప్రేరేపించినా బాధిత మహిళలు తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌ను సంప్రదించవచ్చు. కార్యాలయం వెలుపల ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఫిర్యాదు బాక్స్ అందుబాటులో ఉంటుంది. ఫిర్యాదులను నేరుగా బాక్స్‌లో వేయవచ్చు లేదా కార్యాలయానికి పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ పంపించవచ్చు.

అడ్రస్: తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్, డా. డి.రామానాయుడు బిల్డింగ్ కాంప్లెక్స్,
ఫిలింనగర్, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500 096.

**ఫోన్ హెల్ప్‌లైన్: 9849972280**

ఈ-మెయిల్: complaints@telugufilmchamber.in

21 ఏళ్ల మహిళా కొరియోగ్రాఫర్ కేసును ఆమె మొదట రెండు ప్రముఖ టెలివిజన్ చానెల్‌ను సంప్రదించిన తర్వాత వెలుగులోకి వచ్చిందని, వారు ఆమెను తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ (టిఎఫ్‌సిసి)కి మళ్లించారని వెల్లడించారు.

ఆరున్నర లక్షల సభ్యత్వ రుసుము చెల్లించినప్పటికీ డ్యాన్సర్ల యూనియన్ నుండి సభ్యత్వ కార్డు మంజూరుకు నిరాకరించినట్లు ఆమె ప్రాథమిక ఫిర్యాదులో ఉన్నట్లు సభ్యులు వివరించారు. మొదట ఊహించిన దానికంటే సమస్య చాలా ఘోరంగా ఉందని తెలిసింది. ఆరోపించిన దాడి ప్రారంభమైనప్పుడు బాధితురాలి వయసు 16 సంవత్సరాలు అని, చలనచిత్ర పరిశ్రమ వంటి అసంఘటిత రంగంలోని కార్యాలయ వేధింపుల మార్గదర్శకాల చట్రంలో ఆమెకు ఆశ్రయం కల్పించడం కష్టతరమైనందున మేము ఆమెకు చట్టపరమైన మార్గంలో వెళ్లాలని చెప్పామని ఝూన్సీ వెల్లడించారు.

## సబ్ కమిటీ నివేదిక ఇంకా వెల్లడికాలేదు

పరిశ్రమలోని అన్ని విభాగాల్లో వివరణాత్మక విచారణ జరిపి, కార్యాలయాన్ని రూపొందించడానికి మార్గదర్శకాలను రూపొందించడానికి 2022 జూన్‌లో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ కింద ఏర్పడిన సబ్ కమిటీ ద్వారా అప్పటి తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక సమర్పించబడింది. అయితే ఆ నివేదిక ఇంతవరకు వెలుగుచూడలేదు. తెలుగు చలనచిత్ర వాణిజ్యమండలి ప్రతినిధులు, సపోర్ట్ గ్రూప్ వాయిస్ ఆఫ్ ఉమెన్ మరియు లైంగిక వేధింపుల పరిష్కార ప్యానెల్ సభ్యులతో పాటు నివేదిక ద్వారా చిత్ర పరిశ్రమకు మార్గదర్శకాలు రూపొందించడంలో సహాయం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం మరియు పరిహారం) చట్టం, 2013కింద ఫిర్యాదులను పరిష్కరించడానికి లైంగిక వేదింపుల పరిష్కార కమిటీ కట్టుబడి ఉంది.  తెలుగు చలనచిత్ర మరియు టీవీ డ్యాన్సర్లు మరియు నృత్యదర్శకుల సంఘం (టిఎఫ్‌టిడిడిఎ) అధ్యక్షుడుగా ఉన్న జానీ మాస్టర్‌ను విచారణ పూర్తయ్యేవరకు అధ్యక్ష విధులు నిర్వహించకుండా నిషేధిస్తూ విచారణ కమిటీ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. జానీ మాస్టర్‌పై ఐపిసిలోని సెక్షన్ 376 (రేప్), సెక్షన్ 506 (క్రిమినల్ బెదిరింపు), మరియు సెక్షన్ 323లోని క్లాజ్ 2 మరియు ఎన్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. మరోపక్క బాధిత మహిళా కొరియోగ్రాఫర్‌ను పరిశ్రమనుండి బహిష్కరించకుండా చర్యలు తీసుకుంటామని ఝూన్సీ తెలిపారు. ప్రతిభ గల ఆ యువతి ప్రస్తుతం కొన్ని భారీ బడ్జెట్ నిర్మాణాల్లో పనిచేస్తోందని, పలువురు నిర్మాతలు, ప్రముఖ నటుడు ఆమెకు మద్దతు పలికారని ఝూన్సీ వెల్లడించారు.

# నివేదిక బయటపెట్టని ప్రభుత్వం.. అమలులోకి రాని సిఫార్సులు

కేరళలో జస్టిస్ హేమ కమిటీ నివేదిక వెలుగులోకి రావడంతో మలయాళ చిత్ర పరిశ్రమలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అయితే తెలుగు సినీ పరిశ్రమలోనూ అలాంటి వాతావరణమే ఉండటంతో రెండేళ్లుగా బయటకు రాని తెలుగు సినీ పరిశ్రమకు సంబంధించిన నివేదికనూ బయటపెట్టాలన్న డిమాండ్ పెరుగుతోంది. 2018 అక్టోబర్‌లో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వం 2019 ఏప్రిల్‌లో 25మందితో కమిటీ వేసింది. ఇందులో 12మంది మహిళలతో ఉప కమిటీ వేసింది. ఈ ఉన్నత స్థాయి కమిటీ విస్తృత అధ్యయనం, పరిశీలన, సంప్రదింపుల అనంతరం - తెలుగు సినీ, టెలివిజన్ పరిశ్రమలోనూ మహిళలపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. అభద్రతా భావం, లింగవివక్ష కనిపిస్తోంది. నటీమణులు, గీత రచయితలు, జూనియర్ ఆర్టిస్టులు ఇలా అన్ని స్థాయిల్లోనూ పురుషాధిక్యత కనిపిస్తోంది. అసభ్య, అవమానకరమైన భాషను వాడుతున్నారు. సురక్షిత రవాణా వసతి లేకుండా రాత్రివేళల్లో ఆలస్యమయ్యేలా పనులు చేయిస్తున్నారు' అంటూ 2022 జూన్ 1న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అది ఇప్పటివరకు బహిర్గతం కాకపోగా సిఫార్సులు సైతం అమలులోకి రాకపోవడం గమనార్హం.

## నివేదికలో ఏం తేల్చారంటే...

★ సినీ రంగంలో పలువురు మహిళలు తాము ఎదుర్కొంటున్న వేధింపులపై మాకు ఫిర్యాదు చేశారు. రికార్డింగ్ స్టూడియోలతో పాటు ఫిల్మ్ సెట్లలో, ఆడిషన్ చాంబర్లలో అవమానాలు పడుతున్నట్లు వివరించారు. జూనియర్, డైలాగ్ ఆర్టిస్టుల్లో చాలామంది తమ రోజువారీ కూలీ కోసం కార్యాలయాల చుట్టూ చాలారోజులు తిరగాల్సి వస్తోందన్నారు. కొంతమంది కోఆర్డినేటర్లు, మధ్యవర్తులపై ఆధారపడుతున్నట్లు చెప్పారు. దీనిపై తెలుగు సినీ కళాకారుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ తమ సంఘంలో నమోదు కానివారు మాత్రమే కోఆర్డినేటర్లపై ఆధారపడుతూ లైంగిక దోపిడీకి గురవుతున్నారని వెల్లడించినట్లు కమిటీ పేర్కొంది.

★ సినిమాలు, టీవీలు, యూట్యూబర్ చానళ్ల పేరిట మహిళలను పిలిచి మూసి వున్న గదుల్లో ఆడిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. అక్కడ ఇతర మహిళలెవరూ ఉండట్లేదు. ఆడిషన్లను రికార్డు కూడా చేయడం లేదు. రవాణా సౌకర్యం కల్పించకపోవడం వేధింపులకు

కారణమవుతోంది. డాన్స్ స్కూళ్లలోనూ వివక్ష ఎదుర్కొంటున్నారు. ఆడిషన్లలోనే వేధింపులకు బీజం పడుతోందని, దీనికి మేనేజర్లు, ఏజెంట్లే బాధ్యులని ఒక మహిళా జర్నలిస్టు మాకు వివరించినట్లు తెలిపింది.

★ లైంగిక వేధింపుల గురించి ఎవరైనా ప్రశ్నిస్తే అవకాశాలు రానివ్వకుండా చేసి పరిశ్రమనుంచి బయటకు పంపుతున్నారు. దీంతో చాలామంది భయపడి నిజాలు చెప్పడం లేదు. సినీ పరిశ్రమకు చెందిన సంఘాల్లో తక్కువమంది మహిళలకు సభ్యత్వాలు కల్పిస్తున్నారు. వీటిల్లో సభ్యత్వ రుసుం భారీగా ఉంటోంది. కొన్నింట్లో రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకు ఉంది. దీనిని మహిళలు చెల్లించలేకపోతున్నారు. సినిమాటోగ్రఫీ అసోసియేషన్‌లో మొత్తం 400మంది సభ్యుల్లో ఇద్దరు, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్స్ అసోసియేషన్‌లో మొత్తం 580 మందిలో ఒక్కరు, కాస్ట్యూమర్స్ యూనియన్‌లో మొత్తం 500 మందిలో 20మంది, తెలుగు సినీ దర్శకుల సంఘంలో మొత్తం 1200మందిలో 25మంది, రచయితల సంఘంలోని 1500మందిలో 75మంది మాత్రమే మహిళలు ఉన్నారని నివేదిక వెల్లడించింది.

★ సినీ పరిశ్రమలో నిర్దిష్ట పనిగంటలు లేవు. ఉదయం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు పని చేయాల్సి వస్తోందని మహిళలు తెలిపారు. టీవీ పరిశ్రమలో ఉదయం 4 నుంచి రాత్రి 8 వరకు పనిచేస్తున్నారు. పని ప్రదేశాల్లో మహిళలకు సరైన వసతి సౌకర్యాలు లేవు. బాత్‌రూమ్‌లు, ఆహారం, రవాణా వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు. దుస్తులు మార్చుకోవడానికి గదులు లేకపోగా వేతనాలు కూడా సరిగా ఇవ్వడం లేదు. వారినుంచి ఏజెంట్లు కమిషన్లు వసూలు చేస్తున్నారు అని కమిటీ తెలిపింది.

సినీ, టీవీ పరిశ్రమలో మహిళలకు భద్రత, రక్షణ కల్పించాలి. దీనికి ప్రభుత్వం, సినిమాటోగ్రఫీ, స్త్రీ శిశు సంక్షేమం, కార్మిక, పోలీసు శాఖలు చొరవ తీసుకోవాలని కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. మహిళల ఫిర్యాదుల కోసం ఇక్కడ పోలీసు శాఖ షి-టీమ్‌ల ఆధ్వర్యంలో ఒక హెల్ప్‌లైన్ ఏర్పాటుచేయాలి. వేధింపుల ఫిర్యాదులపై విచారణకు తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇంటర్నల్ కమిటీ నెలకొల్పాలి.

పరిశ్రమలోని ప్రతి యూనియన్‌లోనూ అలాంటి కమిటీ ఒకటి ఉండాలి. యూనియన్లలో మహిళల ప్రాతినిధ్యం పెరగాలి. పరిశ్రమలో కోఆర్డినేటర్ల వ్యవస్థను క్రమబద్ధీకరించాలి. ఆడిషన్లను అందరి సమక్షంలో నిర్వహించాలి. చిత్రీకరణ స్థలాల్లో టాయిలెట్లు, దుస్తులు మార్చుకోవడానికి గదులు, రవాణా సదుపాయం కల్పించాలి. కార్మిక, మహిళా చట్టాలను అమలుచేయాలి అని కమిటీ సిఫార్సు చేసింది.

పిల్లలపై లైంగిక వేధింపులు

# పోక్సో చట్టం - 2012

మహిళలపై జరుగుతున్న అకృత్యాలకు అంతులేకుండా పోతున్న నేటి ఆధునిక కాలంలో చిన్నారులను సైతం వదలని వికృత పైశాచికత్వం ప్రబలిపోతోంది. ఎన్ని చట్టాలు చేసినా వాటి గురించి భయమే లేనట్టుగా వ్యవహరిస్తున్న ఘటనలు ఇటీవలి కాలంలో పెరిగిపోతున్నాయి. పిల్లలపై లైంగిక దాడికి పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించేందుకు 2012లో పోక్సో చట్టం (The Protection of Childrem from Sexual offences Act) అమలులోకి వచ్చింది. 18 సంవత్స రాల లోపు పిల్లలందరికీ లైంగిక వేధింపుల నుంచి ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది. 12 సంవత్స రాల కంటే తక్కువ ఉన్న బాలికలపై అత్యాచారానికి పాల్పడే నిందితులకు కఠినమైన శిక్ష అమ లయ్యేలా ఈ చట్టాన్ని రూపొందించారు. వారిపై అత్యాచారానికి పాల్పడిన దోషులకు మరణ శిక్ష విధిస్తారు. మహిళలపై అత్యాచారానికి పాల్పడిన వారికి జీవితఖైదుగా 10 నుండి 7 సంవ త్సరాల వరకు కఠినంగా శిక్షిస్తారు. 16 ఏళ్లలోపు బాలికపై అత్యాచారం జరిగితే కనీస శిక్షగా 10 నుంచి 20 సంవత్సరాల వరకు జైలుశిక్ష విధిస్తారు. అత్యాచార కేసుల వేగవంత విచార ణకు కోసం ప్రభుత్వం కాలపరిమితి సూచించింది. రెండు నెలల్లో కేసు విచారణ పూర్తిచేయా లని కూడా కాలపరిమితి విధించింది. అత్యాచార కేసుల్లో అప్పీళ్ల పరిష్కారానికి ఆరు నెలల కాలపరిమితిని నిర్దేశించింది. బాలికపై లైంగికంగా హింసిస్తే పోక్సో చట్టం కింద నిందితు డిపై ఫిర్యాదు చేయవచ్చు. అంతేకాకుండా హైకోర్టు సూచనలతో కొత్త ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేస్తారు. ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదులు చేసేందుకు ప్రత్యేకంగా పోక్సో ఈ-బాక్స్ కూడా ఏర్పాటుచేశారు. వాటితోపాటు ఆసుపత్రులు, పోలీసుస్టేషన్లు, కోర్టుల్లో ఫిర్యాదు చేసేలా పిల్ల లకు స్నేహపూర్వక వాతావరణం కల్పించింది.

అయితే చాలామంది చిన్నపిల్లలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నప్పటికీ వారిని గుర్తిం చలేకపోవడంతో ఫిర్యాదు చేయలేకపోతున్నారు. ముద్దు పెట్టడం, లైంగిక చర్యకు ప్రేరణ, రహస్య భాగాలను తాకడం, నగ్న చిత్రాలను చూపడం వంటివి వేధింపుల్లో భాగమేననే విషయం చిన్నారులకు తెలియడం లేదు. చాలా సందర్భాల్లో లైంగికంగా వేధించేవారు కుటుంబ సభ్యులు లేదా దగ్గరి బంధువులై ఉండటం వల్ల ఫిర్యాదు చేయడానికి వెనుకాడుతు న్నారు. అత్యాచారం కేసుల్లో నిందితుడు బాధితురాలి కుటుంబానికి చెందిన వ్యక్తి అయితే శిక్షల విషయంలో ఆ సమస్య మరింత పెద్దదవుతోంది. కుటుంబ సభ్యుడు లేదా బంధువు ద్వారా లైంగిక వేధింపులకు గురైన చిన్నారి బాధితులు ముందుకొచ్చి ఫిర్యాదు చేసే అవకా శాలు వాస్తవికంగా చాలా తక్కువగా ఉన్నాయి.

## ఒక్కడు తుపాకీ లాక్కుంటుంటే..

# మీరేం చేస్తున్నారు?

★ ఆయుధాలున్నా పదిమంది పోలీసులు బంధించలేకపోయారా?

★ ఎంతమాత్రం నమ్మశక్యంగా లేదు

★ బద్లాపూర్ నిందితుడి ఎన్‌కౌంటర్‌పై ముంబయి హైకోర్టు

బద్లాపూర్‌లో పాఠశాల విద్యార్థినులపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు అక్షయ్ షిండేను ఎన్‌కౌంటర్‌లో హతమార్చడంపై బొంబాయి హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నేరుగా తలకు గురిపెట్టి ఎలా కాలుస్తారు అని ప్రశ్నించింది. దీనిని ఎన్‌కౌంటర్‌గా పరిగణించలేమని, పోలీసుల వాదనను నమ్మలేని విధంగా ఉందని వ్యాఖ్యానించింది. దర్యాప్తు సక్రమంగా జరగడం లేదని నిర్ధారణ అయితే తగిన ఆదేశాలు జారీచేయాల్సి వస్తుందని జస్టిస్ రేవతి మోహిత్ దేరే, జస్టిస్ పృథ్వీరాజ్ చవాన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ పోలీసులను హెచ్చరించింది. దర్యాప్తు నిస్పక్షపాతంగా జరగాలని తేల్చిచెప్పింది. నిందితుడు అక్షయ్ షిండే తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నప్పుడు, అతడు పోలీసులపై కాల్పులు జరపడానికి ముందే పోలీసులు అతన్ని బంధించడానికి ఎందుకు ప్రయత్నించలేదని కోర్టు ప్రశ్నించింది. నిందితుడిపై తొలుత కాళ్లపై లేదా చేతులపై కాల్పులు జరపకుండా నేరుగా తలపై ఎందుకు కాల్చారంటూ

ప్రశ్నల వర్షం కురిపించింది. 'అతడు తుపాకీ లాక్కుని కాల్పులు జరపడానికి ముందే పోలీసులు బంధించే అవకాశం ఉంది. నిందితుడు అంత బలమైన వ్యక్తి కూడా కాదు. పోలీసుల వాదన ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదు. దీన్ని ఎన్‌కౌంటర్‌గా చెప్పలేం' అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు.

ఈ దశలో ఎలాంటి అనుమానాలు వ్యక్తం చేయలేమని, కానీ పోలీసు అధికారి నుంచి పిస్టల్ లాక్కుని కాల్పులు జరిపాడని నమ్మడం సత్యదూరమని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ షూట్ అవుట్‌ని ఎన్‌కౌంటర్ అని పేర్కొనలేమని, తుపాకీ లాక్కొని దాన్ని అన్‌లాక్ చేసి కాల్పులు జరిపాడనేది నమ్మశక్యంగా లేదని పేర్కొంది. తుపాకీని నిందితుడు లాక్కుంటుంటే నలుగురు అధికారులు ఎందుకు నియంత్రించలేకపోయారు? అలాగే ఏ శిక్షణ లేకుండా తుపాకీని అన్‌లాక్ చేయడం అంత సులువు కాదని కూడా హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించింది. సెప్టెంబర్ 23న అక్షయ్ షిండేను థానె పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన ఘటన మహారాష్ట్రలో తీవ్ర సంచలనం రేపింది. స్కూల్ టాయ్‌లెట్‌లో ఇద్దరు నాలుగేళ్ల బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన 24 ఏళ్ల నిందితుడిని ఆగస్టు 17న పోలీసులు అరెస్టు చేశారు. ట్రాన్సిట్ రిమాండ్ కింద తలోజా సెంట్రల్ జైలునుంచి థానె క్రైమ్‌బ్రాంచ్ కార్యాలయానికి తీసుకొస్తుండని ముంబ్రా బైపాస్ సమీపంలో నిందితుడు పోలీసులనుంచి రివాల్వర్ లాక్కుని దానితో పోలీసులపై కాల్పులు జరిపాడు. పోలీసుల ఎదురుకాల్పుల్లో అక్షయ్ తలకు బుల్లెట్ తగలడంతో అక్కడికక్కడే మరణించాడు.

## నిందితుడి తండ్రి పిటిషన్

బద్లాపూర్ లైంగిక దాడి నిందితుడు అక్షయ్ షిండే తండ్రి అన్నా షిండే బాంబే హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. తన కుమారుడిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని, ఈ కేసును దర్యాప్తు చేయడానికి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను నియమించాలని ఆయన డిమాండ్ చేశాడు. శారీరకంగా బలహీనంగా ఉన్న వ్యక్తి రివాల్వర్‌ను త్వరగా అన్‌లాక్ చేయలేరని, అది అంత సులభం కాదని విచారణ సందర్భంగా కోర్టు వ్యాఖ్యానించింది.


## పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్

ఎన్‌కౌంటర్‌కు బాధ్యులైన పోలీసు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ అక్షయ్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని ధర్మాసనం పేర్కొంది. షిండే మృతిపై దర్యాప్తు జరుపుతున్న మహారాష్ట్ర సిఐడికి కేసు వివరాలను వెంటనే అందజేయాలని ఆదేశించింది. ఫైళ్లను సిఐడికి ఇంకా ఎందుకు అందజేయలేదని ప్రశ్నించింది. సాక్ష్యాల పరిరక్షణ చాలా అవసరం. మీ వైపునుంచి ఏదైనా జాప్యం జరిగితే అనుమానాలు తలెత్తుతాయి అని పోలీసులనుద్దేశించి కోర్టు వ్యాఖ్యానించింది.

# ‘దిశ’ నిందితుల ఎన్‌కౌంటర్ మాదిరిగానే..

గతంలో హైదరాబాద్‌లో జరిగిన ‘దిశ’ నిందితుల ఎన్‌కౌంటర్ మాదిరిగానే బద్లాపూర్ అత్యాచార నిందితుడి ఎన్‌కౌంటర్ జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్ శివారులో జరిగిన దిశ హత్యాచార నిందితులు పోలీసులు కాల్పుల్లో మరణించారు. ఆ సమయంలోనూ పోలీసుల తీరుపైనా, వివరణపైనా ఎన్నో ప్రశ్నలు ఎదురయ్యాయి. సత్వర న్యాయాన్ని ప్రజలు కోరుకుంటున్నారనే రీతిలో పోలీసులు వ్యవహరించినా చట్టాలు అందుకు ఒప్పుకోవు. దిశ ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ వికాస్ సిర్పూర్కర్ నైతృత్వంలో ఒక కమిటీని సుప్రీంకోర్టు నియమించింది. తాజాగా జరిగిన బద్లాపూర్ ఎన్‌కౌంటర్‌పై ఆయన స్పందిస్తూ ఎన్‌కౌంటర్ జరిగిందన్న దానిపై మాత్రమే రిపోర్టులు వచ్చాయి. అక్కడ ఏం జరిగిందనే దాని గురించి విచారించేందుకు సిఐడి ఒక కమిటీ వేసింది. ఆ నివేదిక ఇంకా రాలేదు కాబట్టి ఈ విషయం గురించి మరింతగా మాట్లాడటం సరైంది కాదని అన్నారు. ఇలాంటి ఎన్‌కౌంటర్లు చాలా అరుదుగా జరుగుతాయి. కొన్నేళ్ల కిందట బీహార్‌లోనూ, హైదరాబాద్‌లోనూ జరిగాయి. ఇప్పుడు మహారాష్ట్రలో జరిగింది. ఇలా ఎన్‌కౌంటర్లు చేయడం ఎంతమాత్రం సరికాదు అని అన్నారు. ఎన్‌కౌంటర్ తర్వాత న్యాయం లభిస్తుందా లేదా అన్న నిర్ణయించాలి. ఎన్‌కౌంటర్లు చేయడం పోలీసుల ఉద్యోగం కాదు. విచారణ చేయడమే వారి విధి. ఎన్‌కౌంటర్లు చాలా అసాధారణమైన పరిస్థితుల్లో మాత్రమే జరుగుతాయి అని జస్టిస్ సిర్పూర్కర్ వ్యాఖ్యానించారు. నిందితులను ఎన్‌కౌంటర్ చేస్తే సత్వర న్యాయం ఎవరికి దొరికిందనేది ప్రశ్నించుకోవాలి.

హైదరాబాద్ దిశ ఎన్‌కౌంటర్‌లో పోలీసులను ప్రజలు ఎలా అభినందించారో, పూలవర్షం కురిపించారో చూశాం. ఆ తర్వాత దర్యాప్తులో ఏం తేలింది? అని సిర్పూర్కర్ ప్రశ్నిస్తున్నారు. జరిగింది ఎన్‌కౌంటర్ కాదనీ, నలుగురు వ్యక్తులను పోలీసులు కాల్చిచంపారని ఆ తర్వాత విచారణలో తేలింది. అప్పట్లో నేను ఇచ్చిన నివేదికలో పోలీసుల తప్పు ఉన్నట్లు తేలింది. ఒక మైనర్ సహా నలుగురు వ్యక్తుల్ని కాల్చిచంపడం న్యాయం కాదన్నది నా అభిప్రాయం అని సిర్పూర్కర్ పేర్కొన్నారు. హైదరాబాద్ హైకోర్టులో ప్రస్తుతం ఇది పెండింగ్‌లో ఉందని, దీని గురించి తాను ఎక్కువ మాట్లాడనని ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. కాగా, దిశ కేసులో సుప్రీం కోర్టు నియమించిన కమిషన్ తన నివేదికను 2022 జనవరి 28న అత్యున్నత న్యాయస్థానానికి సమర్పించింది. అత్యాచారం కేసులో నిందితులైన వారిని చంపాలన్న ఉద్దేశంతోనే పోలీసులు కాల్పులు జరిపినట్లు పేర్కొంది. ఘటన సమయంలో పదిమంది పోలీసులు ఉన్నారని, వారిపై హత్యానేరం కింద విచారణ జరపాలని కమిషన్ సిఫారసు చేసింది.


పిల్లలకు అశ్లీల చిత్రాలు చూపించడం..
బాలికలతో అసభ్య ప్రవర్తన చట్టరీత్యా నేరం

# మూడేళ్లలో 13.13 లక్షల మంది మహిళలు మిస్సింగ్!

దేశంలో 2019-21 సంవత్సరాల మధ్య 13.13 లక్షల మంది బాలికలు, మహిళలు కనిపించకుండాపోయారని కేంద్రం తెలిపింది. ఇందులో మధ్యప్రదేశ్ నుంచి అత్యధికంగా సుమరు 2 లక్షల మంది ఉన్నారని, ఆ తర్వాతి స్థానంలో పశ్చిమ బెంగాల్ ఉందని పేర్కొంది. ఇటీవల జరిగిన పార్లమెంటు సమావేశాల్లో కేంద్ర హోం శాఖ ఇందుకు సంబంధించి నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) నమోదు చేసిన గణాంకాలను వెల్లడించింది. మూడేళ్ల కాలంలో మిస్సయిన మొత్తం 13.13 లక్షల మందిలో బాలికలు 2,51,430 మంది కాగా, 18 ఏళ్లు పైబడిన వారి సంఖ్య 10,61,648 అని వివరించింది. 2019-21 మధ్య కాలంలో మధ్యప్రదేశ్‌లో అత్యధికంగా 1,60,180 మంది మహిళలు, 38,234 మంది బాలికలు అదృశ్యమయినట్లు ఆ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఆ తర్వాతి స్థానంలో ఉన్న పశ్చిమ బెంగాల్‌లో 1,56,905 మంది మహిళలు, 36,606 మంది బాలికలు మిస్సయ్యారని తెలిపింది. ఇదే సమయంలో మహారాష్ట్రలో 1,78,400 మంది మహిళలు, 13,033 మంది బాలికలు, ఒడిశాలో 70,222 మంది మహిళలు, 16,649 మంది బాలికలు, ఛత్తీస్‌గఢ్‌లో 49,116 మంది మహిళలు, 10,817 మంది బాలికలు కనిపించకుండాపోయారు. ఇదే కాలంలో దేశ రాజధాని ఢిల్లీలో 61,054 మంది మహిళలు, 22,919 మంది బాలికలు మిస్సింగ్ అయ్యారు.

## .. యువతి మిస్సింగ్ కేసు ..

## హైదరాబాద్ పోలీసులపై హైకోర్టు సీరియస్

ఓ యువతి మిస్సింగ్ కేసులో హైదరాబాద్ పోలీసులపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసుకు సంబంధించి సీనియర్ అధికారిని నియమించాలంటూ చెప్పినా నిర్లక్ష్యం వహించడంపై మండిపడింది. కుమార్తె కోసం తండ్రి పడుతున్న ఆవేదన కనిపించడం లేదా అని ప్రశ్నించింది. తక్షణం సీనియర్ అధికారిని నియమించి యువతి ఆచూకీని కుటుంబ సభ్యులకు తెలపాలంటూ మరోసారి ఆదేశాలు జారీచేసింది. వివరాల్లోకి వెళితే - హైదరాబాద్ పాతబస్తీ మీర్‌చౌక్ ప్రాంతానికి చెందిన దిలీప్ ధారకు దీపికా ధార అనే 19

సంవత్సరాల కుమార్తె ఉంది. బషీర్‌బాగ్‌లోకి ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. అయితే ఏప్రిల్ 29న అర్ధరాత్రి నుంచి కుమార్తె కనిపించకపోవడంపై అతను మీర్‌చౌక్ పోలీసులను ఆశ్రయించాడు. తన కుమార్తెను మహారాష్ట్ర నాందేడ్ జిల్లాకు చెందిన షేక్ రెహానా పాషా అనే వ్యక్తి ఎత్తుకెళ్లాడంటూ పిర్యాదు చేశాడు. తన కుమార్తెకు పాషా మాయమాటలు చెప్పి తీసుకువెళ్లాడంటూ పిర్యాదులో పేర్కొన్నాడు. అతని ఖాతాకు తన ఫోన్ నుంచి 12వేలు పంపిందని, బీరువాలో దాచిన 25వేల రూపాయలు తీసుకెళ్లిందని తెలిపాడు. వెళ్లే సమయంలో ఇంటి మెయిన్‌డోర్‌కు సైతం తాళం వేసిందని చెప్పాడు. పిర్యాదు స్వీకరించిన మీర్ చౌక్ పోలీసులు పట్టించుకోవడం లేదని, తన కుమార్తె ఆచూకీ కోసం దర్యాప్తు చేయాలని దిలీప్ హెబియస్ కార్పస్ రిట్‌తో తెలంగాణ హైకోర్టును ఆశ్రయించాడు. ఈ మేరకు విచారణ చేపట్టిన ధర్మాసనం ప్రత్యేక అధికారిని నియమించాలని నగర పోలీసులకు ఆదేశాలు జారీచేసింది. అయితే హైకోర్టు ఆదేశించినప్పటికీ పోలీసులు అధికారిని నియమించలేదు. దీనిపై బాధితుడు పలుమార్లు తిరిగినా ప్రయోజనం లేకపోవడంతో మళ్లీ హైకోర్టు తలుపు తట్టాడు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు చెప్పినా నిర్లక్ష్య ధోరణి సరికాదని హెచ్చరించింది. వెంటనే సీనియర్ అధికారిని నియమించి యువతి ఆచూకీ కుటుంబ సభ్యులకు తెలపాలని ఆదేశించింది.



# గర్భాశయ క్యాన్సర్‌కు భారత్‌లో వ్యాక్సిన్ తయారీ

## క్వాడ్ సదస్సులో ప్రధాని మోదీ




అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అధ్యక్షతన జరిగిన క్వాడ్ సదస్సుకు హాజరైన
ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోని ఆల్బనీస్, జపాన్ ప్రధాని కిషిడా ఫుమియో, భారత ప్రధాని నరేంద్రమోదీ


**మ**హిళలు ప్రధానంగా ఎదుర్కొంటున్న గర్భాశయ క్యాన్సర్‌ను అరికట్టేందుకు ప్రపంచ దేశాలు సహకరించుకోవాలని భారత ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. అమెరికా క్వాడ్ సదస్సులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్‌ను అరికట్టేందుకు భారత్ సొంతంగా వ్యాక్సిన్‌ను తయారుచేసిందని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో దీనికోసం కొత్త చికిత్సా విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ఆయన ప్రకటించారు. క్యాన్సర్‌పై పోరాటానికి ప్రపంచ దేశాధినేతలు మద్దతు పలకడం హర్షదాయకమన్నారు. క్యాన్సర్ నివారణకు సహ కారం అవసరం. క్యాన్సర్ చికిత్స ఖరీదైన ప్రస్తుత సమయంలో బాధితులకు ఆర్థిక భారం తగ్గిం చేందుకు స్క్రీనింగ్, రోగ నిర్ధారణ, చికిత్సకు సమగ్ర విధానం అవసరమని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం చాలా ఖర్చుతో కూడుకున్న గర్భాశయ క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) స్క్రీనింగ్ ప్రోగ్రామ్

భారత్‌లో భారీ స్థాయిలో అమలుచేయబడుతోంది. దీంతోపాటు భారతదేశం ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య బీమా పథకాన్ని అమలుచేస్తోంది. అందుబాటు ధరలో అందరికీ మందులు అందించేందుకు ప్రత్యేక కేంద్రాలు కూడా ఏర్పాటుచేశామని మోదీ తెలిపారు. వైట్‌హౌస్ చొరవ క్యాన్సర్ నివారణలో పురోగతి సాధించడానికి ఉపయోగపడుతుందన్నారు. కొవిడ్ మహమ్మారి సమయంలో క్వాడ్ చొరవతో భారత్ ఇండోపసిఫిక్ కోసం వ్యాక్సిన్ అందించగలిగామన్నారు. అదేవిధంగా గర్భాశయ క్యాన్సర్ నివారణలోనూ సంయుక్తంగా ఎదుర్కోవాలని నిర్ణయించుకున్నట్లు మోదీ వివరించారు. సంయుక్త సహకారంతోనే అతి పెద్ద వ్యాధులను ఎదుర్కోగలమన్నారు. 'వన్ ఎర్త్ - వన్ హెల్త్' స్ఫూర్తితో భారతదేశం క్వాడ్ మూన్‌షాట్ ఇనిషియేటివ్ కింద నమూనా వ్యాక్సిన్‌ల కోసం 7.5 మిలియన్ డాలర్లను ప్రధాని మోదీ ప్రకటించారు. దీంతోపాటు ఇండో పసిఫిక్ దేశాలకు గవి, క్వాడ్ కార్యక్రమాల కింద భారత్‌నుంచి 40 మిలియన్ల వ్యాక్సిన్ డోస్‌లు అందించబడుతున్నట్లు వెల్లడించారు. ఈ 40 మిలియన్ల వ్యాక్సిన్ డోసులు కోట్లాది ప్రజల జీవితాల్లో ఆశాకిరణాలుగా మారనున్నాయన్నారు. క్వాడ్ పనిచేసేది దేశాల కోసం మాత్రమే కాదని, ఇది ప్రజల బాగుకోసమని ప్రధాని మోదీ అన్నారు. రేడియో థెరపీ చికిత్సా సామర్థ్యాన్ని పెంపొందించడంలో కూడా భారతదేశం సహకరిస్తుందన్నారు. కాగా, క్యాన్సర్ మూన్‌షాట్‌పై అమెరికా ఇప్పటికే చర్యలు ప్రారంభించింది.

ఇప్పటివరకు క్యాన్సర్ మూన్‌షాట్ ఐదు ప్రాధాన్యతా చర్యలను పరిష్కరించడానికి 95 కంటే ఎక్కువ కొత్త ప్రోగ్రామ్‌లు, విధానాలను ప్రకటించింది. దీనికోసం 170 ప్రైవేటు కంపెనీలు, లాభాపేక్ష లేని సంస్థలు, విద్యాసంస్థలు, పేషంట్ గ్రూప్‌లు కూడా ముందుకు వచ్చాయి. ఢిల్లీలోని అమెరికా ఎంబసీ గత ఆగస్టులో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇమ్యునాలజీ, ఢిల్లీలో మొట్టమొదటి అమెరికా-ఇండియా క్యాన్సర్ మూన్‌షాట్ డైలాగ్‌ను నిర్వహించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ ద్వారా ఇది హోస్ట్ చేయబడింది. ఇది ప్రధానంగా క్యాన్సర్‌పై దృష్టి సారించింది.

*'వన్ ఎర్త్ - వన్ హెల్త్' స్ఫూర్తితో భారతదేశం క్వాడ్ మూన్‌షాట్ ఇనిషియేటివ్ కింద నమూనా వ్యాక్సిన్‌ల కోసం 7.5 మిలియన్ డాలర్లను ప్రధాని మోదీ ప్రకటించారు. దీంతోపాటు ఇండో పసిఫిక్ దేశాలకు గవి, క్వాడ్ కార్యక్రమాల కింద భారత్‌నుంచి 40 మిలియన్ల వ్యాక్సిన్ డోస్‌లు అందించబడుతున్నట్లు వెల్లడించారు. ఈ 40 మిలియన్ల వ్యాక్సిన్ డోసులు కోట్లాది ప్రజల జీవితాల్లో ఆశాకిరణాలుగా మారనున్నాయన్నారు. క్వాడ్ పనిచేసేది దేశాల కోసం మాత్రమే కాదని, ఇది ప్రజల బాగుకోసమని ప్రధాని మోదీ అన్నారు. రేడియో థెరపీ చికిత్సా సామర్థ్యాన్ని పెంపొందించడంలో కూడా భారతదేశం సహకరిస్తుందన్నారు.*

# భయపెడుతున్న మంకీపాక్స్



త్వరగా వ్యాపిస్తున్న మంకీపాక్స్ వైరస్ భయాందోళనకు గురిచేస్తోంది. దీని తీవ్రత, వ్యాప్తి లక్షణాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా ఈ వైరస్ కేసులు పెరుగుతున్నాయి. మధ్య మరియు తూర్పు ఆఫ్రికా నుండి మొదలైన ఈ వైరస్ ఇప్పడు భారత్‌కు చేరింది. పాకిస్తాన్‌లో మూడు మంకీపాక్స్ కేసులు నమోదయ్యాయి. సౌదీ అరేబియానుండి వచ్చిన వ్యక్తిలో మొదటి కేసు కనుగొన్నారు. ముఖ్యంగా ఆఫ్రికాలోని డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో మంకీపాక్ విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా ఆ దేశంలో ఏడాది కాలంలో 548మంది మరణించారు. ఈ వైరస్ జంతువులనుండి మనుషులకు వ్యాపిస్తుంది. మనుషుల్లోకి చేరిన తర్వాత వేగంగా వ్యాప్తి చెందుతుంది. ఈ వైరస్‌ను తొలిసారిగా 1958లో గుర్తించారు. దీని కేసులు చాలావరకు మధ్య మరియు పశ్చిమాసియాలో కనుగొన్నారు. ఎందుకంటే అక్కడ మనుషులు జంతువులకు దగ్గరగా జీవించే అలవాటు ఉండటంతో వైరస్ వ్యాప్తి చెందుతోందని గుర్తించారు. ఈ వైరస్ సోకి నప్పడు జ్వరం రావడంతో పాటు శరీరం అంతటా దద్దుర్లు వ్యాపిస్తాయి. ఇవి ముఖం, జననేంద్రియాలపై పుట్టుకువస్తాయి. చీముతో నిండిన తెలుపు, పసుపు రూపంలో ఉంటాయి. దురద, నొప్పిని కలిగివుంటాయి. జ్వరం, తలనొప్పి, కండరాల నొప్పి ఉంటుంది. అయితే ఈ వైరస్ వల్ల మరణ ప్రమాదం చాలా తక్కువ. అది సహజంగానే తగ్గిపోవడం కూడా ఈ వైరస్ లక్షణం. వైరస్ సోకిన తర్వాత 21 రోజుల వరకు ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఈ వైరస్ 14 నుండి 21 రోజుల ఉంటుంది. ఈ వ్యాధికి టీకా కూడా అందుబాటులో ఉంది. మంకీపాక్స్ సోకిన వ్యక్తితో సాన్నిహిత్యంగా ఉంటే ఇది త్వరగా సోకుతుంది. లైంగిక సంబంధాలు, చర్మ సంపర్కం కారణంగా

సోకుతుంది. కళ్లు, శ్వాస, ముక్కు, నోటి ద్వారా ఈ వైరస్ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఎలుక, ఉడుత, కోతుల నుంచి ఈ వైరస్ సంక్రమించే ప్రమాదముంది.

## భారత్‌లో తొలి మంకీపాక్స్ కేసు నమోదు

ఐసొలేషన్‌లో ఆఫ్రికా నుంచి వచ్చిన యువకుడు

కరోనా మహమ్మారి ప్రభావం ప్రపంచ దేశాలను ఇప్పటికీ భయపెడుతున్న నేపథ్యంలో తాజాగా మరో వైరస్ మానవాళిని తీవ్రంగా వణికిస్తోంది. ఆఫ్రికా, యూరప్ దేశాల్లో వ్యాప్తి చెందుతున్న మంకీపాక్స్ వైరస్ ఇప్పుడు భారత్‌లోకి ప్రవేశించింది. ఇటీవల ఆఫ్రికానుంచి భారత్‌కు వచ్చిన ఓ యువకుడికి మంకీపాక్స్ వ్యాధి లక్షణాలున్నాయని గుర్తించిన అధికారులు అతడ్ని ఐసొలేషన్‌కు తరలించి పర్యవేక్షణలో ఉంచారు. పరీక్షల అనంతరం మంకీపాక్స్ సోకి నట్లు నిర్ధారించారు. బాధితుడికి వెస్ట్ ఆఫ్రికన్ క్లాడ్ 2 ఎంపాక్స్ వైరస్ ఉన్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ ఏడాది ఇప్పటివరకు ఇదే మొదటి మంకీపాక్స్ వైరస్ కేసు అని వెల్లడించింది. భారత్‌లో తొలిసారి 2022లో 30కి పైగా మంకీపాక్స్ కేసులు వెలుగుచూశాయని ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం నమోదైన వెస్ట్ ఆఫ్రికన్ క్లాడ్ 2 ఎంపాక్స్ వైరస్ రకం 2022లో నమోదైన కేసుల మాదిరి ప్రమాదకరం కాదని స్పష్టం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం ఎంపాక్స్ క్లాడ్ 1 ఆరోగ్య అత్యవసర స్థితికి సంబంధించిన వైరస్ కాదని వివరించింది. అయితే ఇప్పుడు వైరస్ సోకిన వ్యక్తి మంకీపాక్స్ కేసుల తీవ్రత ఎక్కువగా ఉన్న దేశంనుంచి ఇటీవలే భారత్‌కు వచ్చినట్లు తెలిపింది. అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆరోగ్య సమస్యలు ఏమీ లేవని కేంద్ర ఆరోగ్య సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

ప్రపంచవ్యాప్తంగా మంకీపాక్స్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య శాఖ అన్ని రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను అప్రమత్తం చేసింది. వైరస్ లక్షణాలు ఉన్నాయని అనుమానం వచ్చిన వ్యక్తులందరికీ స్క్రీనింగ్, టెస్టింగ్, కాంటాక్ట్ ట్రేసింగ్ చేయాలని కేంద్రం సూచించింది. బాధితులకు చికిత్స అందించేందుకు ఐసొలేషన్ కేంద్రాలను సిద్ధం చేయడానికి ఆస్పత్రులను గుర్తించాలని రాష్ట్రాలను కోరింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం 2022 జనవరి నుంచి 2024 ఆగస్టు మధ్య ప్రపంచంలోనే 120 దేశాల్లోనే మంకీపాక్స్ కేసులు వెలుగుచూశాయి. మొత్తం లక్షకు పైగా కేసులు నమోదు కాగా, 220 మరణాలు సంభవించాయి.

గతంలో భారత్‌లో నమోదైన మంకీపాక్స్ వైరస్ వేరియంట్ కంటే ఈసారి సోకిన వేరియంట్ అంత ప్రమాదకరం కాదని, దీంతో అంతగా భయపడాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం తేల్చింది.

# ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఆతిశీ మార్లినా సింగ్



**ఆతిశీ** మార్లినా సింగ్ - ఈ పేరు దేశంలో సంచలనాన్నే సృష్టించింది. ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నవ శకానికి శ్రీకారం చుట్టింది. సామాన్య మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఆతిశీ ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన అతి పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. విద్యావేత్త, ఉద్యమాల బాట, సమాజం పట్ల బాధ్యత, రాజకీయ చతురత - అన్నీ కలగలసిన ఆమె నవతరం మెచ్చిన రాజకీయ శక్తిగా ఎదిగారు. ఒక మహిళగా ఆతిశీ తన ప్రస్థానంలో పూల వర్షాలే కాదు, కఠిన పరీక్షలు మరెన్నో సవాళ్లను అధిగమించి ముఖ్యమంత్రి స్థాయికి చేరడం ఆమె స్థైర్యానికి, ధైర్యానికి ప్రతీక అనడంలో ఎలాంటి సందేహం లేదు. దేశ రాజధానిలో పుట్టి పెరిగిన ఆతిశీ తల్లిదండ్రులు విజయ్‌సింగ్ తోమార్, త్రిప్తావాహి - ఇద్దరూ ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు. పంజాబీ మూలాలున్న కుటుంబం. మార్క్స్, లెనిన్ కలిపి తమ కూతురి పేరులో 'మార్లినా'ను జోడించారు ఆమె తల్లిదండ్రులు. 2019 పార్లమెంటు ఎన్నికలకు ముందు తన ఇంటిపేరు తొలగించి ఆతిశీ మాత్రమే ఉంచుకున్నారు. 'ప్రజలు నా పని గురించి మాట్లాడాలి. నా వారసత్వం గురించి కాకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నా' అని ప్రకటించారు. అరవింద్ కేజ్రీవాల్ కేబినెట్‌లో ఒకే ఒక్క మహిళా మంత్రి ఆతిశీ. సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం లేకపోయినా, తొలిసారి మంత్రి పదవి చేపట్టినా- ఆమె ఎంతో పరిణతి కనబరిచారు. కల్కాజీ నియోజకవర్గంనుంచి గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టిన ఆమెకు రాజకీయ గురువు ఆప్ అధినేత అరవింజ్ కేజ్రీవాల్. అవినీతి ఆరోపణలపై ఆయన అరెస్టయిన నాటినుంచి ఢిల్లీ రాజకీయాల్లో ఆతిశీ కేంద్ర బిందువుగా మారారు. పార్టీని ముందుండి నడిపించారు. కేబినెట్‌లో మంత్రిగా ఆతిశీ 14 శాఖలను పర్యవేక్షిస్తున్నారు. వాటిల్లో ఆప్ ప్రభుత్వం పటిష్టంగా తీసుకున్న విద్యాశాఖతో పాటు కీలకమైన ఆర్థిక, ప్రణాళిక, స్త్రీ శిశుసంక్షేమం, నీటిపారుదల వంటి శాఖలున్నాయి. కేజ్రీవాల్ బెయిల్‌పై బయటకు రావడం, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయ

డంతో ముఖ్యమంత్రి రేసులో పలువురి పేర్లు పరిశీలనకు వచ్చినా చివరకు ఆతిశీనే ఆ పదవి వరించింది.

ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్, నెంబర్ టూగా వున్న మనీశ్ సిసోడియా అరెస్టులతో పార్టీలో గందరగోళంలో పడింది. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో అన్నీ తానై ముందుండి ప్రజలకు, కార్యకర్తలకు ఆతిశీ ధైర్యం కల్పించారు. తన వాగ్ధాటితో ప్రత్యర్థుల నోటికి తాళం వేశారు. ఆరోపణలను, విమర్శలను సమర్థంగా తిప్పికొట్టారు. తద్వారా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపారు. సహచర మంత్రులతో కలిసి పాలన గాడి తప్పకుండా చూసుకోగలిగారు. అదే సమయంలో లోక్‌సభ ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేశారు. నిత్యం జనం మధ్యనే ఉంటూ, సాధ్యమైనన్ని సమావేశాలు నిర్వహించి అరెస్టులతో మసకబారిన పార్టీ ప్రతిష్ఠను నిలబెట్టే ప్రయత్నం చేశారు. హర్యానా నుంచి ఢిల్లీకి రావాల్సిన వంద మిలియన్ గ్యాలన్ల నీటిని విడుదల చేయకపోవడంతో నిరాహార దీక్ష చేపట్టారు. ఆరోగ్యం క్షీణించి ఆస్పత్రిపాలయ్యారు కూడా. ఎంతటి ఒత్తిడినైనా భరించడానికి, ఎలాంటి సవాళ్లనైనా స్వీకరించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండటం ఆతిశీ బలం. ఆమ్‌ఆద్మీ పార్టీలో అందరికంటే ఉన్నత విద్యావంతురాలు ఆతిశీ. ప్రభుత్వ విద్యావ్యవస్థలో మార్పునకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో నూతన విద్యావిధానం రూపకల్పనలో కీలకపాత్ర పోషించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, మెరుగైన పాఠ్యప్రణాళికలను రూపొందించడంలో ఎంతో పురోగతి సాధించారు. విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధితో పాటు విలువలనూ నేర్పేందుకు కృషిచేశారు. ఒక రకంగా ఢిల్లీ ప్రభుత్వ పాఠశాలల ముఖచిత్రాన్ని మార్చిన ఘనత ఆతిశీదే.

## ఏడేళ్లు శ్రమించి...

ఢిల్లీ స్ప్రింగ్‌డేల్స్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం మొదలై సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో హిస్టరీతో 2001లో డిగ్రీ పూర్తిచేశారు. స్కాలర్‌షిప్‌పై ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో మాస్టర్స్ చదివారు. 2005లో రోడ్స్ స్కాలర్‌షిప్‌తో ఆక్స్‌ఫర్డ్‌లోని మగ్దాలెన్ కాలేజీలో డబుల్ మాస్టర్స్ పట్టా పొందారు. ఆప్‌తో అనుబంధానికి ముందు ఆతిశీ మధ్యప్రదేశ్‌లోని ఓ మారుమూల గ్రామంలో ఏడేళ్లు నివసించారు. అక్కడ ఓ స్వచ్ఛంద సంస్థతో కలిసి సేంద్రియ సాగు, ప్రగతిశీల విద్యావిధానంపై అధ్యయనం చేశారు. పలు ఎన్‌జిఓలతో కలిసి పనిచేశారు. ఆ తరువాత ఆప్ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చడంతో రాజకీయ అరంగేట్రం చేశారు. 2013 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టో డ్రాఫ్టింగ్ కమిటీలో సభ్యులయ్యారు. పార్టీ విధాన రూపకల్పనలో కీలకంగా వ్యవహరించారు. అవకాశం వచ్చిన ప్రతిసారీ ఆతిశీ తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. మరికొద్ది నెలల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆతిశీపై అతి పెద్ద బాధ్యతే ఉందని చెప్పాలి.



# మహిళా ముఖ్యమంత్రులు వీరే..

భారత చట్టసభల్లో మహిళల కోటా అందని ద్రాక్షపండుగానే ఉన్నా అవకాశాన్ని దక్కించుకున్న మహిళల్లో కొందరు ఉన్నత పదవులను అధిరోహించారు. ఎన్నికల రణరంగంలో పోటీని ఎదుర్కొని విజయాలను సాధించి పురుషులకు దీటుగా ముఖ్యమంత్రి పదవిని అధిరోహించి పాలన కొనసాగించారు. సవాళ్లను ఎదుర్కొని సమయస్ఫూర్తిని ప్రదర్శించి పేరు గడించిన మహిళా ముఖ్యమంత్రులు కూడా ఉన్నారు. స్వతంత్ర భారతావనిలో ఇప్పటివరకు 16మంది వివిధ రాష్ట్రాల్లో మహిళలు ముఖ్యమంత్రులుగా బాధ్యతలు నిర్వహించారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ఆశితీ సింగ్ 17వ వ్యక్తిగా మహిళా ముఖ్యమంత్రుల జాబితాలో చోటుదక్కించుకున్నారు.

**సుచేతా కృపలానీ:** స్వతంత్ర భారతదేశంలో మొట్టమొదటి మహిళా ముఖ్యమంత్రిగా సుచేత కృపలానీ రికార్డు సృష్టించారు. దేశంలోనే అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌కు 1963 నుంచి 1967 వరకు ముఖ్యమంత్రిగా పనిచేశారు

**నందిని శతపథి:** దేశంలో రెండవ మహిళా ముఖ్యమంత్రి నందిని శతపథి. ఇందిరాగాంధీకి అత్యంత సన్నిహితురాలైన నందిని ఒడిశా ముఖ్యమంత్రిగా 1972 నుంచి 1976 వరకు పనిచేశారు.

**శశికళ కకోద్కర్:** మహారాష్ట్రవాది గోమంతక్ పార్టీ నేత శశికళ కకోద్కర్ 1973 నుంచి 1979 దాకా కేంద్ర పాలిత ప్రాంతమైన గోవా, డయ్యూడామన్‌కు రెండు పర్యాయాలు ముఖ్య మంత్రిగా వ్యవహరించారు. 1987లో గోవాకు రాష్ట్ర హోదా లభించింది.

**అన్వర తైమూర్:** దేశంలో మొదటి ముస్లిం మహిళా ముఖ్యమంత్రి అన్వర తైమూర్ రికార్డు కెక్కారు. ఆమె 1980 నుంచి 1981 దాకా అస్సాం ముఖ్యమంత్రిగా పనిచేశారు.

**విఎన్ జానకీ రామచంద్రన్:** ప్రఖ్యాత తమిళ నటుడు, దివంగత ముఖ్యమంత్రి ఎంజిఆర్ భార్య వి.ఎస్.జానకీ రామచంద్రన్ తమిళనాడు తొలి మహిళా ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. 1988లో భర్త ఎంజిఆర్ మరణం తర్వాత కేవలం 23 రోజులపాటు ముఖ్యమంత్రిగా పని చేశారు.

**కె.జయలలిత:** ఎంజిఆర్ శిష్యురాలు, డిఎంకె నేత, సినీ నటి జె.జయలలిత ఆరు పర్యాయాలు తమిళనాడు ముఖ్యమంత్రిగా సేవలందించారు. మొత్తం 14 ఏళ్లకు పైగా ముఖ్య మంత్రి పదవిలో కొనసాగారు.

**మాయావతి:** బహుజన్ సమాజ్ పార్టీ అధినేత మాయావతి నాలుగు పర్యాయాలు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. మొత్తం ఏడు సంవత్సరాల పాటు ఆమె ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు.

**రాజీందర్ కౌర్ భట్టాల్:** పంజాబ్‌కు ఏకైక మహిళా ముఖ్యమంత్రి రాజీందర్ కౌర్ భట్టాల్ రికార్డుకెక్కారు. ఆమె 1996 నుంచి 1997 దాకా పంజాబ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

రబ్రీదేవి: ఆర్‌జెడి చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ జైలుపాలు అవడంతో ఆయన భార్య రబ్రీ దేవి 1997లో బీహార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. బీహార్‌లో ఇప్పటివరకు ఏకైక మహిళా ముఖ్యమంత్రి ఆమె ఒక్కరే.

**సుష్మా స్వరాజ్:** ఢిల్లీ తొలి మహిళా ముఖ్యమంత్రి సుష్మా స్వరాజ్. 1998లో ఆమె 52 రోజుల పాటు ఈ పదవిలో కొనసాగారు.

**షీలా దీక్షిత్:** ఢిల్లీ రెండో మహిళా ముఖ్యమంత్రి షీలా దీక్షిత్. ఢిల్లీలో అత్యధిక కాలం పనిచేసిన ముఖ్యమంత్రిగా రికార్డు నెలకొల్పారు. ఆమె 1998 నుంచి 2013 వరకు 15 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగారు.

**ఉమాభారతి:** రామజన్మభూమి ఉద్యమ నేత ఉమాభారతి 2003 నుంచి 2004 దాకా

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా సేవలందించారు.


**వసుంధర రాజె:** గ్వాలియర్ మహారాజు జీవాజీరావు సింధియా, విజయరాజే సింధియా దంపతుల కుమార్తె అయిన వసుంధర రాజె రెండు పర్యాయాల్లో 10 సంవత్సరాల పాటు రాజస్థాన్ ముఖ్యమంత్రిగా పనిచేశారు.

**మమతా బెనర్జీ:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ 2011 నుంచి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు.

**ఆనందిబెన్ పటేల్:** గుజరాత్‌కు ఏకైక మహిళా ముఖ్యమంత్రి ఆనందిబెన్ పటేల్. నరేంద్ర మోదీ తర్వాత ఆమె 2014నుంచి 2016 దాకా ముఖ్యమంత్రిగా పనిచేశారు.

**మహబూబా ముఫ్తీ:** పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ (పిడిపి) నేత మహబూబా ముఫ్తీ జమ్మూకాశ్మీర్ తొలి మహిళా ముఖ్యమంత్రిగా చరిత్ర సృష్టించారు. 2016 నుంచి 2018 వరకు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు.

**ఆతిశీ సింగ్:** ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ రాజీనామా చేయడంతో నూతన ముఖ్యమంత్రిగా ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకురాలు ఆతిశీ సింగ్ 2024 సెప్టెంబర్ 21న ప్రమాణ స్వీకారం చేశారు.



# హక్కుల ఉద్యమకారిణి హరిణి

## శ్రీలంక ప్రధానిగా బాధ్యతల స్వీకారం



హక్కుల కార్యకర్తగా, నిరుద్యోగం, లింగవివక్ష, స్త్రీవాదం వంటి అనేక సామాజిక అంశాలపై శ్రీలంకలో తన గళాన్ని వినిపించిన హరిణి అమరసూర్య శ్రీలంక నూతన ప్రధానిగా బాధ్యతలు స్వీకరించారు. లెక్చరర్ నుంచి పార్లమెంటు సభ్యురాలిగా ఎదిగిన ఆమె ప్రస్థానంలో సామాజిక స్పృహ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఆ అంశమే హరిణిని ప్రధాని స్థాయివరకూ తీసుకొచ్చింది. శ్రీలంక సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఆమె నియామకం దోహదపడుతుందనడంలో సందేహం లేదు. ప్రధానిగా హరిణి సరియైన వ్యక్తి అనే మాట ఇప్పుడు చాలమంది నోట వినిపిస్తున్న మాట. అత్యున్నత పదవుల విషయంలో సరియైన వ్యక్తి అనే పదం చాలా అరుదుగా వినిపిస్తుంటుంది. ఆ ఘనతను హరిణి అమరసూర్య దక్కించుకోవడం విశేషం.

కొలంబోలో పుట్టి పెరిగిన హరిణి అమరసూర్య హిందూ కాలేజీ, ఢిల్లీ యూనివర్శిటీలో బిఎ, సిటీలోని మక్వరీ యూనివర్శిటీలో ఆంత్రోపాలజీ అండ్ డెవలప్‌మెంట్, శిశు సంరక్షణ, గ్లోబలైజేషన్ అండ్ డెవలప్‌మెంట్ - ఇలా ఎన్నో అంశాలపై లోతైన పరిశోధన చేయడంలో అనేక పుస్తకాలను రచించింది. డిగ్రీ తర్వాత శ్రీలంకలోని మెంటల్ హెల్త్ ఆర్గనైజేషన్ 'నెస్ట్'తో కలిసి పనిచేసింది. నెస్ట్ వ్యవస్థాపకురాలైన సాలి హులుగల్లె అట్టడుగు, అణగారిన వర్గాల కోసం పనిచేసింది. నెస్ట్ ద్వారా ఎంతో మార్పు తీసుకురాగలిగింది. ఆమె ప్రభావంతో మానసిక వైద్యశాలలోఎంతోకాలంగా దిక్కూమొక్కూ లేకుండా పడివున్న దీనులతో పాటు ఎవరూ పట్టించుకోని హెచ్ఐవి బాధితులు, అనాథ పిల్లల సంరక్షణలో హరిణి పాలుపంచుకుంది. చైల్డ్ ప్రొటెక్షన్, సైకలాజికల్ ప్రాక్టీషనర్‌గా ఎన్నో సంవత్సరాలు పనిచేసిన తరువాత శ్రీలంక



ఓపెన్ యూనివర్శిటీలో లెక్చరర్‌గా పనిచేసింది. ఉచిత విద్య కోసం ఉద్యమాలు చేసింది. ఫెడరేషన్ ఆఫ్ యూనివర్శిటీ టీచర్స్ అసోసియేషన్ సభ్యురాలైన హరిణి లింగసమానత్వం నుంచి జంతు సంక్షేమం వరకూ ఎన్నో అంశాలపై తన గళాన్ని వినిపించింది.

ఇక రాజకీయాల విషయానికి వస్తే 2019లో నేషనల్ ఇంటలెక్చువల్ ఆర్గనైజేషన్‌లో చేరిన హరిణి శ్రీలంక అధ్యక్ష ఎన్నికల సమయంలో నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) అభ్యర్థి అనురా కుమార దిస్సానాయకే తరపున ప్రచారం చేసింది. 2020 శ్రీలంక పార్లమెంటరీ ఎన్నికల తరువాత ఎంపీగా పార్లమెంటులోకి అడుగుపెట్టింది. ఎంపీగా తన రాజకీయ జీవితాన్ని కొనసాగించడానికి లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా చేసింది. 'ఆంగ్ల సాహిత్యంలోకి అడుగుపెట్టిన తరువాత నా చుట్టూ ఉన్న ప్రపంచం గురించి తెలుసుకోవాలనే ఆసక్తి మొదలైంది. ఆ తరువాత కాలంలో సాహిత్య అధ్యయనం కంటే నా చుట్టూ ఉన్న సమాజాన్ని లోతుగా అధ్యయనం చేయాలనిపించింది' అంటుంది హరిణి. పుస్తక ప్రపంచం కంటే సామాజిక వాస్తవ ప్రపంచంలోనే ఆమెకు ఎక్కువ విషయాలు తెలిసాయి. నిరుద్యోగం నుంచి లింగవివక్ష వరకు ఎన్నో సమస్యలను ప్రత్యక్షంగా చూసింది. ఉద్యమకారిణిగా ప్రయాణం ప్రారంభించడానికి ఆ తరువాత రాజకీయాల్లోకి అడుగుపెట్టడానికి సమాజం అనే పుస్తకం ఆమెకు ఎంతో ఉపయోగపడింది. భారత రాజధాని ఢిల్లీలోని హిందూ కళాశాల పూర్వవిద్యార్థి అయిన హరిణి శ్రీలంక ప్రధాని కావడంతో పూర్వవిద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

*నెఫ్ట్ వ్యవస్థాపకురాలైన సాలి హులుగల్లె అట్టడుగు, అణగారిన వర్గాల కోసం పనిచేసింది. నెఫ్ట్ ద్వారా ఎంతో మార్పు తీసుకురాగలిగింది. ఆమె ప్రభావంతో మానసిక వైద్యశాలలోఎంతోకాలంగా దిక్కూమొక్కూ లేకుండా పడివున్న దీనులతో పాటు ఎవరూ పట్టించుకోని హెచ్ఐవి బాధితులు, అనాథ పిల్లల సంరక్షణలో హరిణి పాలుపంచుకుంది. చైల్డ్ ప్రొటెక్షన్, సైకలాజికల్ ప్రాక్టీషనర్‌గా ఎన్నో సంవత్సరాలు పనిచేసిన తరువాత శ్రీలంక ఓపెన్ యూనివర్శిటీలో లెక్చరర్‌గా పనిచేసింది. ఉచిత విద్య కోసం ఉద్యమాలు చేసింది.*

# అఫ్గాన్ మహిళల నోటికి తాలిబన్ల 'తాళం'

★ బహిరంగంగా మాట్లాడకూడదు
★ ముఖం ఏమాత్రం కనిపించడానికి వీల్లేదు
★ నానాటికీ పెరుగుతున్న నిర్బంధాలు

ప్రపంచమంతా కాలంతో పరుగులు తీస్తుంటే అఫ్గానిస్తాన్ మాత్రం ఇంకా రాతియుగం నాటి నిబంధనలతో ఏదో సాధిద్దామని భావిస్తోంది. మూడేళ్ల క్రితం అధికారాన్ని చేపట్టిన తాలిబన్లు అక్కడి మహిళలకు చుక్కలు చూపిస్తున్నారు. ఆంక్షల కొలిమిలో మహిళల మనుగడ దినదినగండంగా మారుతోంది. అఫ్గాన్‌లో మహిళలపై తాలిబన్లు పాల్పడుతున్నా అకృత్యాలు చెప్పనలవి కాదు. ఉన్నత విద్య అభ్యసించడానికి వీల్లేదు. ఆరో తరగతి వరకే పరిమితం కావాలి. ఒళ్లంతా పూర్తిగా కప్పకుంటే తప్ప ఇంట్లోనుంచి బయటకు అడుగుపెట్టకూడదు. ఈ అణచివేతకు పరాకాష్ఠగా తాలిబన్లు మరో మతిలేని నిర్ణయానికి తెరలేపారు. ఇకనుంచి మహిళలు బహిరంగ ప్రదేశాల్లో మాట్లాడానికి వీల్లేందంటూ హుకుం జారీచేశారు. ప్రసార మాధ్యమాల్లో కూడా వారి స్వరం పొరపాటున కూడా వినిపించకూడదు. అంతేకాదు ఇల్లు దాటాలంటే ఒంటితో పాటు ముఖాన్ని కూడా పూర్తిగా కప్పకోవాలనేది మరో నిబంధన. మహిళల అస్తిత్వానికి, ఆత్మగౌరవానికి గొడ్డలిపెట్టు లాంటి నిర్ణయాలపై అంతర్జాతీయ సమాజం ముక్కున వేలేసుకుంటోంది. 'సద్గుణాల వ్యాప్తి, దుర్గుణాల కట్టడి' పేరిట తాలిబన్లు మూడేళ్ల క్రితం ఏకంగా ఒక శాఖనే ఏర్పాటుచేశారు. మహిళలపై మరిన్ని ఆంక్షలు విధిస్తూ తాజాగా తీసుకున్న నిర్ణయాలతో 114 పేజీల డాక్యుమెంట్‌ను ఆ శాఖ విడుదల చేసింది. అందులో 35 రకాల కొత్త నిబంధనలను పొందుపరిచారు. మహిళలు ఇకపై బహిరంగ స్థలాల్లో మాట్లాడేందుకు వీల్లేదన్నది వాటిలో ప్రధానమైనది. ఈ నిబంధనలకు తాలిబల్ పాలకుడు హిబతుల్లా కఖుంద్‌జాదా ఇటీవల ఆమోదముద్ర వేశారు. మంచిని పెంచేందుకు, చెడును తరిమేందుకు ఈ నూతన ఇస్లామిక్ నిబంధనలు ఎంతగానో దోహదపడతాయి అని సంబంధిత శాఖ అధికార ప్రతినిధి ఓ ఇంటర్వ్యూలో గొప్పగా చెప్పకొచ్చారు.

# ఇవీ కొత్త ఆంక్షలు

- మహిళలు ఇకపై బహిరంగ ప్రదేశాల్లో మాట్లాడానికి వీల్లేదు
- బహిరంగ ప్రదేశాల్లో గట్టిగా చదవకూడదు, పాటలు పాడకూడదు, రాగాలు తీయకూడదు
- మీడియాలో కూడా మహిళల గొంతు ఏ రకంగానూ వినిపించకూడదు
- రక్త సంబంధీకులను, భర్తను తప్ప మరే పురుషునివైపు కన్నెత్తి చూడవద్దు
- బహిరంగ ప్రదేశాల్లో మహిళలు మగవాళ్లతో మాట్లాడటం నిషిద్ధం
- మహిళలు బయటికి వచ్చినప్పుడు ముఖం పూర్తిగా కప్పుకోవాలి. లేకపోతే వాళ్లను చూసి మగవాళ్లు ఉద్రేకానికి లోనయ్యే ప్రమాదముంది.
- హిజాబ్‌తో సరిపెడతామంటే కుదరదు. ముఖం పూర్తిగా కప్పుకోవాల్సిందే.
- మహిళలు ఇకనుంచి సంగీత వాయిద్యాలను ఉపయోగించకూడదు.
- పురుషులు గడ్డం చేసుకోకూడదు. నియమిత వేళల్లో విధిగా ఉపవాసం ఉండాలి.
- అఫ్గాన్ మీడియా ఇకపై షరియా చట్టాలను ఖచ్చితంగా పాటించాలి
- మీడియాలో ఎవరి ఫొటోలు చూపించడానికి, ప్రచురించడానికి వీల్లేదు

# ఇవీ శిక్షలు

- నూతన నిబంధనలు ఉల్లంఘించే మహిళలకు తొలుత హెచ్చరికలు జారీ. అనంతరం ఆస్తుల జప్తు - మూడు రోజుల నిర్బంధం - ఆ తర్వాత అవసరాన్ని బట్టి కఠిన శిక్షలు. నిబంధనలు ఉల్లంఘించిన కేసుల్లో వేలాదిమంది అఫ్గాన్ మహిళలు నిర్బంధంలో మగ్గుతున్నారు.

---

# ఆ తీర్పు చెల్లదు

## విడాకులు తీసుకున్న బాల వధువు కేసులో తాలిబాన్ కోర్టు



బీబీ నజ్దానా అనే యువతికి బాల్య వివాహం జరిగింది. అది ఆమెకు నచ్చలేదు. విడాకుల కోసం రెండేళ్ల పాటు న్యాయ పోరాటం చేయాల్సి వచ్చింది. చివరకు అఫ్గనిస్తాన్ కోర్టు ఆమెకు విడాకులు మంజూరు చేసింది. అయితే తర్వాత ఇస్లామిక్ చట్టం (షరియా) కారణంగా నజ్దానాకు మంజూరైన విడాకులను తాలిబాన్ కోర్టు రద్దు చేసింది. ఆఫ్గానిస్తాన్ 2021లో తాలిబాన్ల నియంత్రణలోకి వెళ్లిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నజ్దానా లాంటి వేలాది

కోర్టు తీర్పులను తాలిబాన్లు రద్దుచేశారు. తాలిబాన్లు కాబూల్‌ను స్వాధీనం చేసుకున్న పది రోజులకే నజ్దానాకు మంజూరైన విడాకులను రద్దు చేయాలంటూ ఆమె భర్త హెక్మతుల్లా తాలిబాన్ కోర్టును ఆశ్రయించాడు. నజ్దానాకు ఏడేళ్ల వయస్సున్నప్పుడు ఆమెను పెళ్లి చేసుకుంటానని హెక్మతుల్లా వాగ్దానం చేశాడు. నజ్దానా తండ్రి ఈ 'బ్యాడ్ మ్యారేజ్'కి అంగీకరించాడు. వివాహం ద్వారా 'శత్రువు'లను 'మిత్రులు'గా మార్చి కుటుంబ వివాదాలను పరిష్కరించుకోవడాన్నే 'బ్యాడ్ మ్యారేజ్' అంటారు.

ఆ తర్వాత ఎనిమిదేళ్లకు అంటే నజ్దానాకు 15 ఏళ్ల వయస్సు రాగానే ఆమెను తనకు అప్పగించాలని హెక్మతుల్లా డిమాండ్ చేశాడు. అది తనకు ఇష్టం లేదని నజ్దానా (2021లో) న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కోర్టుకు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇస్తూ, నజ్దానా తనకు నచ్చిన వ్యక్తిని వివాహం చేసుకోవచ్చునని వెల్లడించింది. మూడేళ్ల క్రితం తాలిబాన్లు అధికారంలోకి వచ్చినప్పుడు గతంలో మాదిరి అవినీతి జరగబోదని, షరియా చట్టం ప్రకారం న్యాయం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అప్పటి నుంచి దాదాపు 3,55,000 కేసులను సమీక్షించామని తాలిబాన్లు చెప్పారు. వాటిలో 40 శాతం వరకు భూవివాదాలు, 30 శాతం వరకు నజ్దానా కేసులాంటి కుటుంబ వివాదాలు ఉన్నాయి. గతంలో ఉన్నది అవినీతి ప్రభుత్వమని, హెక్మతుల్లా-నజ్దానాల వివాహన్ని రద్దు చేయడం షరియా, వివాహ నిబంధనలకు విరుద్ధమని తాలిబాన్ల కోర్టు పేర్కొనడం ఇక్కడ గమనించాలి. తాలిబాన్లు రాగానే మునుపటి న్యాయమూర్తులందరినీ తొలగించారు. వారికి అనుకూలంగా నిలిచే వారిని మాత్రమే నియమించారు. మహిళలను న్యాయవ్యవస్థలో పాల్గొనడానికి అనర్హులుగా ప్రకటించారు. కోర్టుల్లోకి మహిళలను అనుమతించకపోతే వారికి ఇంకేం న్యాయం జరగుతుందని అఫ్ఘానిస్తాన్ సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి ఫౌజియా అమినీ అన్నారు. తాలిబాన్లు అధికారంలోకి రాగానే ఆమె ఆ దేశం విడిచి పారిపోయారు. నజ్దానా విడాకుల వంటి గత తీర్పులను తాలిబాన్లు రద్దు చేయాన్ని అమినీ ఖండించారు. 'పాలన మారినంత మాత్రన తీర్పులు మారతాయా?' అని ఆమె ప్రశ్నించారు. 'అఫ్ఘానిస్తాన్‌లో సివిల్ కోడ్ గత యాభై సంవత్సరాలుగా అమలులో వుందని, తాలిబాన్లు పుట్టక ముందే నుంచే అది ఉందని, విడాకులు సహా అన్ని పౌర, శిక్షాస్మృతులూ ఖురాన్ నుంచి స్వీకరించినవేనని' ఆమె గుర్తుచేశారు.

'ఐక్యరాజ్య సమితితో సహా సహాయం కోసం చాలా తలుపులు తట్టాను. కానీ ఎవరూ నా గోడు వినలేదు. స్త్రీలకు మద్దతు ఎక్కడ వుంది? నాకు నా ఇష్ట ప్రకారం బతికే స్వేచ్ఛ లేదా?' అని నజ్దానా ప్రశ్నిస్తోంది. అఫ్ఘాన్‌లోని ఒక కూడలి వద్ద చెట్టు కింద కూర్చుని తనకు గతంలో మంజూరైన విడాకుల పత్రాలను చేతబట్టుకుని ఎవరైనా సహాయం చేస్తారనే ఆశతో ఎదురు చేస్తోంది నజ్దానా.

# భార్యకు స్కూటర్ యాక్సిడెంట్.. తనపై తానే కేసు పెట్టుకున్న భర్త

తన భార్య స్కూటర్ ప్రమాదంలో గాయపడానికి తానే కారణమని, తనపై కేసు నమోదు చేయాలంటూ ఓ భర్త తనకు తానుగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తనమీద తానే ఫిర్యాదు చేయడానికి వచ్చిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక మీడియా కథనాల ప్రకారం - రవిగౌర్ తన భార్య, కుమారుడు, తమ్ముడుతో కలిసి స్కూటర్‌పై వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో అతడి భార్య కాలికి తీవ్ర గాయం కావడం, ఆసుపత్రిలో ఐసియులో చికిత్స అందించాల్సి వచ్చింది. భార్య దుస్థితి చూసి చలించిపోయిన రవిగౌర్ వెంటనే పోలీసు స్టేషన్‌కు వెళ్లి తనపై తానే ఫిర్యాదు చేసుకున్నాడు. తన నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత తనదేనంటూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలను మరోవైపు మళ్లించారని, అయితే ఆలస్యమవుతోందనే తొందరలో తాను వాహనాన్ని వేగంగా నడిపానని, ఫలితంగా రోడ్డుపై ఉన్న చిన్న గోతిలో పడి బ్యాలెన్స్ తప్పి పడిపోయామని, దీంతో తన భార్య కాలికి తీవ్ర గాయమై రక్తస్రావమైందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

# ప్రాణం తీసిన ఫేక్ కాల్

ఓ ఫేక్‌కాల్ మహిళ ప్రాణాలు తీసింది. కూతురు వ్యభిచార రాకెట్‌లో అరెస్టయిందని నకిలీ పోలీసు ఫోన్ చేయడంతో తల్లడిల్లిన ఆ తల్లి గుండె ఆగిపోయింది. ఆగ్రాలో నివాసం ఉంటున్న మహిళ మల్తీ వర్మ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. సెప్టెంబర్ 30న పోలీసు అధికారి పేరుతో ఆమెకు ఓ వాట్సప్ కాల్ వచ్చింది. ఆమె కుమార్తె సెక్స్ ట్రాఫికింగ్ కేసులో అరెస్టయినట్లు అతడు తెలిపాడు. ఆ వీడియోలు లీక్ చేయకుండా ఉండాలంటే లక్ష రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దాంతో ఆందోళనకు గురైన ఆ ఉపాధ్యాయురాలు తన కుమారుడు దివ్యాన్షుకు ఫోన్ చేసి విషయం తెలిపింది. తన కుమార్తెను కేసు నుంచి కాపాడుకునేందుకు ఆ వ్యక్తికి వెంటనే లక్ష రూపాయలు ట్రాన్స్‌ఫర్ చేయాలని చెప్పింది. కానీ ఆ కుమారుడు తెలివిగా వ్యవహరించి, ఆ కాల్ పాకిస్తాన్ నుంచి వచ్చిందని గుర్తించాడు. వెంటనే సోదరికి ఫోన్ చేయగా కాలేజీలోనే ఉన్నట్లు తెలిపింది. అయితే ఆ ఫేక్ కాల్‌లో ఆందోళన చెందిన ఆ తల్లి సాయంత్రం 4 గంటలకు స్కూలు నుంచి తిరిగి వచ్చింది. ఆ వెంటనే కుప్పకూలిపోయి గుండె పోటుతో మరణించింది. విషయం తెలుసుకున్న పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# శవయాత్రకు డప్పు కొట్టలేదని..

## దళిత కుటుంబాన్ని బహిష్కరించిన ఊరి పెద్దలు

శవయాత్రకు డప్పు కొట్టలేదని ఒక దళిత కుటుంబాన్ని సామాజకంగా వెలివేశారు ఆ ఊరి పెద్దలు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజీగూడ గ్రామానికి చెందిన ఒక మాదిగ కుటుంబాన్ని సామాజికంగా బహిష్కరిస్తూ ఊరిపెద్దలు తీర్మానం చేశారు. ఉన్నత విద్యను అభ్యసించి తమకు నచ్చిన ఉద్యోగాలు చేసుకుంటున్న ఎస్సీ యువతను లక్ష్యంగా చేసుకుని ఈ 'వెలి'ని అమలుచేసినట్లు తెలుస్తోంది. దాదాపు 500 మంది జనాభా కలిగిన ఈ గౌతోజీగూడ గ్రామం తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు కేవలం 46 కిలోమీటర్ల దూరంలో ఉంది.

గౌతోజీగూడ గ్రామంలో ముదిరాజ్ కులానికి చెందిన రంగాయిపల్లి మల్లయ్య సెప్టెంబర్ 3న మరణించాడు. మల్లయ్య శవయాత్రలో డప్పు కొట్టాలని పెంచమి చంద్రం కుటుంబాన్ని మృతుడి బంధువులు కోరారు. అయితే చదువుకుని ఉద్యోగాలు చేస్తుండటంతో తమ కులవృత్తిని కొనసాగించలేమని చంద్రం తెగేసి చెప్పాడు. చంద్రం సికింద్రాబాద్‌లో ఎమ్‌కామ్ పూర్తిచేశారు. పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగం చేశాడు. ఆయన తమ్ముడు పంచమి అర్జున్ జెఎన్ టీయూ, హైదరాబాద్‌లో ఎమ్మెస్సీ పూర్తి చేశాడు. ప్రస్తుతం ఓ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆ ఊర్లో పీజీ చేసింది ఈ ఇద్దరేనని తెలిసింది. గత ఐదారేళ్లుగా డప్పు కొట్టడం మానేశామని చంద్రం తెలిపాడు. 'మా తరంలో ఎవరూ చదువుకోలేదు. కనీసం నా కొడుకులైనా చదువుకుంటే బాగుపడతారని రోజూ హైదరాబాద్‌కు కూరగాయలు మోసుకెళ్లి అమ్మి.. ఆ డబ్బుతో నా పిల్లలను చదివించాను' అని వారి తల్లి నర్సమ్మ వివరించింది.

### సామాజిక బహిష్కరణ.. ఎదిరిస్తే జరిమానా

డప్పు కొట్టకపోవడంపై అసహనంతో ఉన్న ఆ ఊరి పెద్దలు సెప్టెంబర్ 10వ తేదీన ఓ సమావేశం నిర్వహించారు. మాజీ సర్పంచ్ బొడ్డు వెంకటేశ్వర్లు, మాజీ ఉపసర్పంచ్ రేణుకుమార్, ఇతర పెద్దలు తమను బహిష్కరిస్తూ తీర్మానించారు. ఆ సమయంలో మా వాదనను కూడా వారు వినలేదని పంచమి చంద్రం చెప్పాడు. మా నాన్న ప్రస్తావన తీసుకొచ్చి మమ్మల్ని అవమానించారు. డప్పు కొట్టకపోతే గ్రామం తరపున తమకు ఇచ్చిన 3 కుంటల భూమి వెనక్కి ఇచ్చేయమని హుకుం జారీ చేశారు. మమల్ని ఊరి నుంచి వెలివేస్తున్నట్లు తీర్మానంలో రాసుకున్నారు. ఎవరైనా మాతో మాట్లాడితే వాళ్లనూ వెలివేస్తామని, 5వేల రూపాయల జరిమానా విధి

స్వామని హెచ్చరించారని చంద్రం ఆవేదన వ్యక్తం చేశాడు.

## 31 మందిపై కేసు నమోదు

ఈ సామాజిక బహిష్కరణపై మెదక్ ఎస్పీకి సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా పంచమి అర్జున్ ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. సెప్టెంబర్ 11న పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామాన్ని సందర్శించారు. 12న దళిత సంఘాలు, మానవ హక్కుల వేదిక నాయకులతో కలిసి మనోహరాబాద్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మొదట 19 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు, తర్వాత బాధితుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మరో 12 మందిపైనా కేసు నమోదు చేశారు. ఇలా వుండగా మాజీ ఉప సర్పంచ్ రేణుకుమార్‌తో పంచమి చంద్రం కుటుంబానికి ఎన్నో ఏళ్లుగా విభేదాలున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వీరిద్దరి ఇళ్లు పక్కపక్కనే ఉన్నాయి. రెండు కుటుంబాల ఇంటిపేర్లూ ఒక్కటే. సెప్టెంబర్ 28న తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ కూడా ఆ గ్రామాన్ని సందర్శించింది. ఊరి పెద్దలు చదువుకోకపోవడం, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులపై వారికి అవగాహన లేకపోవడంతో ఇదందా జరిగినట్లు తెలుస్తోంది. వాళ్లకు కౌన్సిలింగ్ ఇచ్చి ఊరిలో ముున్ముందు ఇలాంటి విభేదాలు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్థానికులు తెలిపారు.

## కుట్ర కోణంలో విచారణ

ఈ ఘటనలో బాదితులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. ఇందులో ఎస్సీల పాత్ర కూడా ఉందని ఆయన అన్నారు. ఒక కుటుంబంలోని వాళ్లు చదువుకుని ముందుకెళ్తుంటే, వాళ్ల బంధువులే అడ్డుకుంటున్నారు... వెనక్కి లాగేందుకు ప్రయత్నిస్తున్నారు. దానికి బీసీలు, ముదిరాజ్‌లు సహకరించారు. దీనిలో కుట్ర కోణం ఉంది. పకడ్బందీగా విచారణ చేసి నిందితులను అరెస్టు చేయాలని పోలీసులను కోరతాం అని వెంకటయ్య అన్నారు.

ఇలావుండగా తమకు ప్రాణ హాని ఉందంటూ పంచమి చంద్రం సెప్టెంబర్ 18న హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను విచారించిన హైకోర్టు బాధితులకు రక్షణ కల్పించాలని, సామాజిక బహిష్కరణ అమలు కాకుండా ఊర్లో బహిరంగంగా ప్రకటించాలని ఆదేశించింది. దీనికి అనుగుణంగా సెప్టెంబర్ 23న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి గ్రామంలో సదస్సు నిర్వహించారు. ఈ కేసులో విషయంలో 26 మందిని అరెస్టు చేసినట్లు మెదక్ జిల్లా తూప్రాన్ డీఎస్పీ ఎస్.వెంకట్‌రెడ్డి తెలిపారు. ఐదుగురు పరారీలో ఉన్నారని వారినీ అరెస్టు చేస్తామని, బాధితులకు ఎలాంటి హానీ జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని వివరించారు.

కరీంనగర్ మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం

# గర్భిణులకు సంపూర్ణ వైద్య సేవలు

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




కరీంనగర్ మాతాశిశు సంరక్షణ కేంద్రంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం గర్భిణులకు సంపూర్ణ వైద్య సేవలు అందిస్తుందని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ సెప్టెంబర్ నెలలో మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రంలో 203 ప్రసవాలు నిర్వహించామని, అంతేకాకుండా ఆర్థోపెడిక్ సంబంధించి 39 మేజర్ సర్జరీలు జరిగాయని పేర్కొన్నారు. గత ఆరు నెలల కాలంలో సుమారు 130 ప్రసవాలు జరిగేవని ఆగస్టు నెలలో 198 ప్రసావలు, సెప్టెంబర్ నెలలో 203 ప్రసవాలు జరిగాయని వివరించారు.

వైద్య సేవలు అందించడంలో విశేషంగా కృషి చేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రతి పిహెచ్‌సి పరిధిలోని గర్భిణులను ట్రాక్ చేస్తూ వారికి ఆశ, ఏఎన్ఎంలను అటాచ్ చేసి 102 వాహనాలు సన్నద్ధం చేస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచుతున్నామన్నారు. గర్భిణులకు అవసరమైన టిఫా స్కానింగ్, ఇతర పరీక్షలు చేస్తున్నామన్నారు. ఓపీ అధికంగా వస్తున్న నేపథ్యంలో ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక రిసెప్షన్ కేంద్రాన్ని ఏర్పాటుచేశామన్నారు. గైనికల్ సేవలే కాకుండా మిగిలిన విభాగాలను సైతం ఆసుపత్రిలో బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రి సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ శ్రీహర్ష పిలుపునిచ్చారు.

# అప్పుడు ఉసురు తీశారు.. ఇప్పుడు ఊపిరి పోస్తున్నారు





**20** ఏళ్ల మోనిక బీహార్‌లో తాను పుట్టిన ప్రాంతానికి వచ్చింది. ఆ ప్రాంతంలోనే సీరోదేవి వందల మంది మహిళలకు పురుళ్లు పోసింది. అయితే మోనిక పుట్టడానికి కొన్నాళ్ల ముందు వరకు సీరోదేవితో పాటు ఆ ప్రాంతంలోని అనేకమంది మంత్రసానులు ఆడశిశువులను పురిట్లోనే చంపేయాల్సి వచ్చేది. అలా చేయాలని వారికి ఒత్తిళ్ళు ఎదురయ్యేవి. అయనప్పటికీ మంత్రసానులు చంపకుండా రక్షించిన శిశువులలో మోనికా తట్టి ఒకరని రికార్డులను బట్టి అర్థమవుతోంది.

ఇది 1996 నాటి మాట. దేశంలోని పేద రాష్ట్రాల్లో ఒకటైన బీహార్‌లో సీరోదేవితోపాటు మరి కొంతమంది మంత్రసానులలను ఓ స్వచ్ఛంద సంస్థ గుర్తించి వాళ్లను గమనించింది. పుట్టింది ఆడపిల్లయితే ఆ శిశువు తల్లిదండ్రుల ఒత్తిళ్ల మేరకు ఆ మంత్రసానులు ఆ శిశువుకు విషమిచ్చో, గొంతు నులిమో చంపేసేవారు. అలాంటి మంత్రసానుల్లో హకియాదేవి ఒకరు ఆమె అప్పట్లో 12 నుంచి 13 మంది శిశువులను చంపినట్లు, మరో మంత్రసాని ధర్మీదేవి 20 మంది శిశువులను చంపినట్లు ఆ సంస్థ గమనించింది. ఒక్క కటిహార్ జిల్లాలోనే 35 మంది మంత్రసానుల చేతుల్లో ఏటా వెయ్యి మంది వరకు ఆడపిల్లలు పుట్టిన వెంటనే మరణించి ఉంటారని 1995లో ఓ స్వచ్ఛంద సంస్థ తన సర్వేలో వివరించింది. ఈ ఆడశిశువుల హత్య కేవలం బీహార్‌కే పరిమితం కాలేదు. మంత్రసాని వృత్తి దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో చాలాకాలంగా పాతుకుపోయింది. ఈ మంత్రసానుల్లో అట్టడుగు వర్గాలకు చెందినవారే ఎక్కువ. కులం, పేదరికం అనేవి ఈ వృత్తి చుట్టూ అల్లుకుపోయాయి. శక్తిమంత్రులైన అగ్రవర్ణాల వారి మాటలను ధిక్కరించడం వీరికి సాధ్యం కాని పని. అయితే మగబిడ్డ పుడితే మాత్రం వెయ్యి రూపాయలో లేక బహుమానాలో ఇచ్చేవారు. ఆడ, మగ శిశువుల మధ్య తేడాకు మూలాలు దేశపు సమాజిక వ్యవస్థలో

పాతుకుపోయిన కట్నం అనే ఆచారంలో ఉన్నాయి. కట్నం ఇవ్వడం, పుచ్చుకోవడం నేరమంటూ 1961లోనే చట్టం వచ్చినా, 1990ల నాటికీ ఈ ఆచారం ప్రబలంగానే ఉండేది. అది ఇప్పటికీ కొనసాగుతున్న విషయం తెలిసిందే.

అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా మంత్రసానుల్లోనూ మార్పు వచ్చింది. 1996 తర్వాత నుంచి అది ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. ఎవరైతే ఇన్నాళ్లూ నవజాత శిశువులను చంపుతూ వచ్చారో, ఆ మంత్రసానులే ఆడశిశువులను రక్షించే బాధ్యతను తీసుకున్నారు. ఆడ పిల్లలను చంపాలన్న ఆదేశాలను పక్కనబెట్టడం మొదలుపెట్టారు. వారిలో మార్పుకు కారణం కొంతమంది సామాజిక కార్యకర్తలే. ఆ కోవకు చెందినవారే అనిలా కుమారి. ఈ సమస్యను ఆమె చాలా సున్నితంగా డీల్ చేశారు. ఆమె చేసిన కృషి వల్ల నవజాత శిశువులపై కొనసాగుతున్న అకృత్యాలు చాలా మేరకు తగ్గాయి. హత్యకు గురికాబోయిన లేక అనాధలుగా వదిలేసిన కనీసం అయిదుగురు నవజాత ఆడశిశువులను ఈ మంత్రసానులు రక్షించి అనిలా కుమారి ద్వారా స్వచ్ఛంద సంస్థకు తరలించారు. వారిలో ఒక శిశువు చనిపోగా మిగిలిన నలుగురు పట్నాలో ఉన్నారు. అలా వీరు రక్షించిన శిశులలో మోనికా ఒకరు. మోనికను కలిసినప్పుడు అనిలా, సీరోదేవి బిగ్గరగా ఏడ్చేశారు. ఏది ఏమైనప్పటికీ ఒక శిశువును రక్షించి, ఆ శిశువు ఎదిగి ఒక అందమైన జీవితాన్ని ఆస్వాదిస్తున్నదని తెలుసుకున్నప్పుడు కలిగే సంతృప్తికి మంచి ఇంకేమంటుందని అనిలా, సీరోదేవి అన్నారు. గతాన్ని మనం మార్చలేం... కానీ పరివర్తనను సాధించవచ్చు, ఆ పరివర్తనలోనే ఒక ఆశ కూడా ఉంటుందని అంటోంది మోనికా.



# జైళ్లలో కులవివక్ష?

## జైలు మాన్యువల్ ప్రాథమిక హక్కులకు విరుద్ధం: సుప్రీం కోర్టు

## ఏపీ సహా 11 రాష్ట్రాల మాన్యువల్‌లో కుల వివక్ష

ఆంధ్రప్రదేశ్ సహా 11 రాష్ట్రాల జైలు మాన్యువల్‌లోని కొన్ని నిబంధనలు కుల వివక్ష చూపుతున్నాయని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. జైళ్లలోని పరిస్థితులపై సుకన్య శాంత అనే జర్నలిస్టు సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పలు రాష్ట్రాల్లోని జైలు మాన్యువల్స్ కుల ప్రాతిపదికన వివక్షను ప్రోత్సహిస్తున్నాయని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. జైలు లోపల పనులు చేయించడానికి కుల ప్రాతిపదికన ఖైదీలను వినియోగిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు సుకన్య. ఖైదీలకు బ్యారక్‌ల కేటాయింపులోనూ కులం చూస్తున్నారని ఆమె అన్నారు. సుకన్య పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు జైలు నిబంధనలను తప్పుబట్టింది. ప్రస్తుతం ఉన్న జైలు మాన్యువల్స్ ప్రాథమిక హక్కులకు విరుద్ధమని, కుల ప్రాతిపదికన వివక్ష చూపుతున్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. మూడు నెలల్లోకి జైలు మాన్యువల్స్‌ను అప్‌డేట్ చేయాలని, ఈ వివక్షపూరిత నిబంధలను తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది.

### జైలు మాన్యువల్ అంటే ఏమిటి?

జైలు మాన్యువల్ అనేది ఖైదీలు ఎలా ఉండాలి? జైలులోవారు ఏ పని చేయాలి? తదితర విషయాల కోసం ఉపయోగిస్తారు. అనేక రాష్ట్రాల్లో జైళ్లలో శుభ్రపరిచే పనిని 'తక్కువ కులం'గా భావించే వ్యక్తులు చేస్తారనే విధానం ఉంది. అదే విధంగా ఆహారాన్ని వండే పని 'ఉన్నత కులం'గా పరిగణించే వ్యక్తులతో చేయిస్తున్నారు. ఈ జైలు మాన్యువల్‌లో కొన్ని తెగలకు చెందినవారిని నేరం చేయడం అలవాటు ఉన్న వ్యక్తులుగా పరిగణిస్తున్నారు.

### వాదనలు ఏం జరిగాయి?

డి-నోటిఫైడ్ తెగల (బ్రిటిష్ పాలనలో చేసిన క్రిమినల్ ట్రైబ్స్ చట్టం ప్రకారం వారిని క్రిమినల్ ట్రైబ్స్‌గా ప్రకటించారు)కు చెందినవారు అనేక జైళ్లలో వివక్షకు గురవుతున్నారని సుకన్య శాంత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ తెగ వ్యక్తులు మొదటిసారి దోషిగా తేలినా కూడా చాలా జైళ్లలో వారిని 'హేబిట్యుయల్ అఫెండర్స్'గా ప్రకటిస్తారు. ఎవరినైతే ఇలా ప్రకటిస్తారో ఆ ఖైదీలను జైలులోని గట్టి భద్రతలో ఉంచుతారు. పశ్చిమ బెంగాల్ జైలు మాన్యువల్ ప్రకారం- అక్కడి క్లీనర్లు తప్పనిసరిగా 'మెహతర్, హడీ లేదా చండాల్' కులానికి చెందిన ఖైదీలు లేదా సాధారణంగా ఈ పని చేసే ఏదైనా కులానికి చెందిన ఖైదీలు అయివుండాలి.

ఉన్నత కులానికి చెందిన ఖైదీ తనకు ఆహారం వండే వంటవాడిపై అభ్యంతరం వ్యక్తం చేస్తే,

ఆయన కోసం కొత్త వంటవాడిని నియమిస్తారని కూడా మాన్యువల్‌లో తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని జైలు మాన్యువల్‌లో క్లీనింగ్ పనులు 'మెహతార్' కులానికి చెందినవారు చేస్తారని ఉంది. ఇటువంటి నిబంధనలు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్, మహారాష్ట్ర, తమిళ నాడు, కేరళ, ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్. ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనూ ఉన్నాయి.

సుకన్య వీటినే సుప్రీం కోర్టులో సవాలు చేశారు. బ్రిటిష్ కాలం నుంచి ఇలాంటి నిబంధ నలు ఉన్నాయని, స్వతంత్ర భారతదేశంలో ఇంకా ఎందుకు వీటిని కొనసాగిస్తున్నారని ఆమె ప్రశ్నించారు.

### సుప్రీం కోర్టు ఏం చెప్పింది?

జైళ్లలో పని విభజనకు కులాన్ని ప్రాతిపదిక ఉపయోగించుటున్నట్లు స్పష్టమవుతోందని సుప్రీం కోర్టు తన తీర్పులో పేర్కొంది. బ్రిటిష్ హయాంలో చేసిన చట్టం కుల వివక్షను చూపుతోంది... స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా కులతత్వాన్ని నిర్మూలించలేకపోయాం. పౌరులందరికీ న్యాయం, సమానత్వం అనే జాతీయ దృక్పథం అవసరం అని పేర్కొంది. కొన్ని వర్గాలకు చెందిన వ్యక్తులు నైపుణ్యం లేదా గౌరవప్రదమైన పని చేయడంలో అసమర్థులనే భావన ప్రోత్సహించేలా జైలు మాన్యువల్స్ ఉన్నాయని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.

## కోర్టు ఆదేశాలు

★ 11 రాష్ట్రాల జైలు మాన్యువల్స్ వివక్ష చూపడంతోపాటు ప్రాథమిక రాజ్యాంగ హక్కులకు హాని కరమంటూ ఆ నిబంధలను కొట్టివేసింది.

★ కుల వివక్షకు సంబంధించిన నిబంధలను కేంద్ర ప్రభుత్వం మూడు నెలల్లోగా మార్చాలి.

★ ఖైదీలు, అండర్ ట్రయల్ ఎవరికైనా జైలు రిజిస్టర్‌లో కులాన్ని తెలిపే కాలమ్ తొలగించాలి.

★ జైలు రికార్డులలో 'హేబిట్యుయల్ అఫెండర్స్' అనే పదం రాష్ట్ర శాసనసభ ఆమోదించిన చట్టాల ప్రకారం మాత్రమే ఉపయోగించాలి.

★ ఎలాంటి కారణం లేకుండా 'డీ-నోటిఫైడ్ ట్రైబ్స్'ను అరెస్టు చేయరాదని పోలీసులు గుర్తుం చుకోవాలి.

★ కులం, జెండర్, వైకల్యం ఆధారంలో జైళ్లలో వివక్షను కోర్టు పర్యవేక్షిస్తుంది. మూడు నెలల్లో కేసును సమీక్షిస్తుంది. అన్ని రాష్ట్రాలు, కేంద్ర ప్రభుత్వం ఆ లోపు సమ్మతి నివేదికను సమర్పిం చాలి.

★ వివక్ష కొనసాగకుండా చూసేందుకు జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ, జైలు సందర్శకుల బోర్డు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి.

★ కేంద్ర ప్రభుత్వం మూడు నెలల్లోగా ఆ తీర్పు కాపీని అన్ని రాష్ట్రాలకు పంపాలి.


# జైళ్ల నిబంధనలు మార్చేలా పోరాడిన సుకన్య



"సుకన్య శాంత... మీరు పరిశోధించి రాసిన కథనానికి ధన్యవాదాలు. మీ కథనం మేరకే ఈ విచారణ ప్రారంభించాం. మీ కథనం వాస్తవికతను ఎంత మార్చిందో తెలియదు గానీ.. ఈ తీర్పు క్షేత్రస్థాయిలో పరిస్థితి మార్చగలదని మేం ఆశిస్తున్నాం" భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఒక మహిళా జర్నలిస్టును ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలివి.

జర్నలిస్టులు తాము రిపోర్టు చేసిన సమస్యలను పరిష్కరించేందుకు సుప్రీం కోర్టుకు వెళ్లడం, అక్కడి నుంచి సామాజిక మార్పు తీసుకురావడం చాలా అరుదు. 'ది వైర్' మీడియా సంస్థలో పని చేస్తున్న సుకన్య శాంత దీన్ని చేసి చూపించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న జైళ్లలో కొనసాగుతున్న కులవివక్షపై ఆమె వరుస కథనాలు రాశారు. ఈ పరంపరలో ఖైదీలకు కుల ప్రాతిపదికన ఇచ్చే పనులు, కులాల ఆధారంగా ఖైదీల విభజన, ఖైదీల హక్కులు తదితర కీలక విషయాలను ఆమె వెలుగులోకి తెచ్చారు. ఈ విషయాలను ఒక సిరీస్‌గా ప్రచురించిన తర్వాత, కేసును సుమోటాగా స్వీకరించిన రాజస్థాన్ హైకోర్టు రాష్ట్రంలో జైళ్ల నిబంధనలను మార్చాలని ఆదేశించింది.

హైకోర్టు నుంచి సానుకూల స్పందన రావడంతో సుకన్య శాంత, లాయర్ దిశా వాడేకర్‌తో కలిసి సుప్రీం కోర్టుకు కేసును తీసుకెళ్లారు. మహారాష్ట్రకు చెందిన ఈ ఇద్దరు మహిళలు సుప్రీం కోర్టు చారిత్రాత్మక తీర్పులో భాగమయ్యారు. కుల వివక్షను ప్రోత్సహించే జైళ్ల నిబంధనలు రాజ్యాంగ విరుద్ధమని 2024 అక్టోబర్ 3న సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిబంధనలను సవరించాలని ఆదేశించింది. అంతేకాకుండా ఖైదీల పట్ల వివక్షను రూపు మాపేందుకు ప్రత్యేక ఆదేశాలు కూడా జారీచేసింది.




చదువు కోవాలని ఉన్నా తప్పని పొట్టతిప్పలు

# బాలల హక్కులు

బాలలకు ప్రధానంగా నాలుగు హక్కులున్నాయి: (1) జీవించే హక్కు, (2) రక్షణ పొందే హక్కు (3) అభివృద్ధి చెందే హక్కు (4) భాగస్వామ్య హక్కు.

## ప్రభుత్వం బాలల కోసం చేసిన చట్టాలు

(1) 1933 నాటి బాలల చట్టం చిన్న పిల్లల శ్రమ దోపిడీ నుంచి రక్షించుకోవడానికి తల్లి దండ్రులకు ఉపాధి, ఆర్థిక సహాయం చేయడం (2) 1938 నాటి బాలల ఉద్యోగ కల్పన చట్టం. కఠిన శ్రమకు లోనైన పనుల్లో పిల్లలను వినియోగించకుండా చూడడం. (3) 1948 నాటి బాల కార్మికుల చట్టం - కర్మాగారాల్లో పిల్లలతో పని చేయించకుండా చూడడం.

## మరికొన్ని బాలల హక్కులు

(1) సంపూర్ణ ఆరోగ్యంగా ఉండే హక్కు (2) తల్లిదండ్రుల సంరక్షణలో ఉండే హక్కు (3) కోరుకున్న పేరును కలిగివుండే హక్కు (4) జీవించే హక్కు (5) పరిశుభ్రమైన తాగునీటి హక్కు (6) సంఘంగా నిర్వహించే హక్కు (7) పోషకాహారం పొందే హక్కు (8) లైంగిక

వేధింపుల నుంచి విముక్తి పొందే హక్కు (9) జాతీయతను కలిగివుండే హక్కు (10) సామాజిక భద్రత పొందే హక్కు (11) వినోదం పొందే హక్కు (12) నాణ్యమైన ఉచిత విద్య పొందే హక్కు (13) విశ్రాంతి పొందే హక్కు (14) సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకునే హక్కు (15) ప్రేమ, ఆప్యాయతలను పొందే హక్కు (16) ఆడుకునే హక్కు (17) శారీరక ఆర్థిక దోపిడీ నుంచి విముక్తి పొందే హక్కు (18) అవమానం నుంచి రక్షణ పొందే హక్కు (19) ప్రశంసలు పొందే హక్కు (20) భావ వ్యక్తీకరణ హక్కు (21) మనిషిగా గుర్తింపు పొందే హక్కు (22) యుద్ధం నుంచి రక్షణ పొందే హక్కు (23) మత స్వాతంత్ర్యపు హక్కు (24) సమాన విద్యావకాశాలు పొందే హక్కు (25) సమాన సాంస్కృతిక అవసరాలు పొందే హక్కు.

## బాలల పార్లమెంటు

(1) పాఠశాలల్లో చదవడం, రాయడం లేదని, మొదటి స్థానం పొందటం లేదని శారీరంగా, మానసికంగా హింసించడానికి వీల్లేదు.

(2) 6 నుంచి 18 సంవత్సరాల వయస్సున్న 30 మంది బాలబాలికలతో ఏర్పాటు చేసినదే బాలల పార్లమెంటు. ఇందులో ఆవాస ప్రాంతంలోని బాలలు సభ్యులుగా ఉంటారు. (3) బాలల పార్లమెంటు విద్య, ఆరోగ్యం, బాలల సమస్యలు, బాలల హక్కుల ఉల్లంఘన వంటి అంశాలతో ప్రతివారం సమావేశం ఏర్పాటు చేసుకుని చర్చించాలి.

## బాలల హక్కుల పరిరక్షణ కేంద్రం

(1) బాలలను శారీరంగా, మానసికంగా హింసించినా, బాలల హక్కులకు భంగం కలిగించినా బాలల హక్కుల పరిరక్షణ కేంద్రం వారు తగిన చర్యలు చేపడతారు. (2) బాలలకు ఉచిత నిర్బంధ ప్రాథమిక హక్కు. 2009 ప్రకారం బాలల హక్కులకు భంగం కలిగించిన వారిపై చర్యలు తీసుకుంటారు. (3) బాలల హక్కుల పరిరక్షణ కేంద్రం ఉచిత ఫోన్ నెం.1800 425 35 25 (4) ఈ సంస్థ కార్యాలయం రాజీవ్ విద్యా మిషన్, హైదరాబాద్‌లో ఉంది.

## బాలల హక్కుల పరిరక్షణ క్లబ్


ప్రతి పాఠశాలలో బాలల హక్కుల పరిరక్షణ క్లబ్‌లు ఏర్పాటు చేయాలి. దీనిలో పాఠశాలలోని బాలలు సభ్యులుగా ఉంటారు. ప్రతి నెలా సమావేశం ఏర్పాటుచేయాలి. బాలల హక్కులకు భంగం వాటిల్లకుండా చూడడం, బాలల అవసరాలు తీర్చడం ఈ క్లబ్ చేయవలసిన పనులు.

# చైల్డ్ లైన్

బాల కార్మికులు, వీధి బాలలు, వివక్షతకు గురైనవారు, లైంగిక వేధింపులకు గురైన వారు, మాదక ద్రవ్యాలకు అలవాటు పడినవారు, బాల్య వివాహ బాధితులు, హెచ్ఐవి / ఎయిడ్స్ బాధితుల కోసం 'చైల్డ్ లైన్' అనే ప్రత్యేక సహాయ కేంద్రం పనిచేస్తుంది. దీని ఉచిత ఫోన్ నెం.1098. వీరికి సమాచారం ఇస్తే తక్షణం హాజరై బాలల సమస్యల పరిష్కారానికి చొరవ చూపిస్తారు. వీరు అవసరమైతే బాలలను పునరవాస కేంద్రాలకు పంపించి ఉచితంగా వసతి కల్పించి చదువు చెప్పిస్తారు. బాలలు లైంగిక వేధింపులకు గురికాకుండా భారత ప్రభుత్వం 2012లో బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని రూపొందించింది.

# ఐక్యరాజ్య సమితి బాలల హక్కుల బిల్లు

18 సంవత్సరాలు నిండని వారంతా బాలలే. బాలల పోషణ, సమగ్రాభివృద్ధి తల్లిదండ్రుల కనీస బాధ్యత. రాజ్యం బాలల హక్కులను గౌరవించి పరిరక్షిస్తుంది. బాలల హక్కుల బాధ్యత లను ఐక్యరాజ్య సమితి 1989లో ప్రతిపాదించింది. ఇవి ప్రపంచంలోని బాలల, యువకుల హక్కులు. భారత ప్రభుత్వం ఈ పత్రాన్ని 1992లో ఆమోదించింది.





# వర్కింగ్ ఉమెన్‌కు ఎదురయ్యే సవాళ్లు..

మహిళలకు బాధ్యతలు ఎక్కువ. అదే వర్కింగ్ ఉమెన్స్‌కు అయితే మరీ ఎక్కువ. ఓ వైపు కుటుంబాన్ని, మరోవైపు ఉద్యోగాన్ని సమన్వయం చేసుకోవాలి. ఇలాంటి సందర్భాల్లో మహిళలకు ఫ్రస్ట్రేషన్‌కు గురవుతుంటారు. ఉద్యోగాలను వదిలేయాలనుకుంటారు. కానీ ఎలంటి సమస్య వచ్చనా ప్రశాంతంగా ఆలోచించి అడుగు ముందుకు వేస్తే పరిష్కారం లభిస్తుంది. వర్కింగ్ ఉమెన్స్ తమ ఫ్యామిలీ లైఫ్‌ను ఎలా బ్యాలెన్స్ చేసుకోవాలి? పని ప్రదేశంలో సవాళ్లను ఎలా అధిగమించాలో ఇప్పుడు తెలుసుకుందాం.

## సొంత నిర్ణయాలు తీసుకునే ధైర్యం

జీవితం అనే పరుగు పందెం ఎవరిది వారిదే. పెళ్లి అనేది బంధం అనుకుంటే బంధం... బంధనం అనుకుంటే బంధనం. కాళీ గెలవాలంటే పరుగెత్తాలి. శ్రమపడాలి. అందుకోసం మొదటగా చేయాల్సింది సొంత ఆలోచనలు. ఎవరి ఆధారం లేకుండా నిలబడే ప్రయత్నం

చేయాలి. ఎవరినో బతిమాలాల్సిన పని లేకుండా నీ నిర్ణయాలను నువ్వే తీసుకునేంత ధైర్యాన్ని తెచ్చుకోవాలి. వర్కింగ్ ఉమెన్స్‌కు పురుషులకు ఉండని సమస్యలు ఉంటాయి. అందుకు కారణాలు అనేకం. కుటుంబం ఒత్తిళ్లు, ఆరోగ్యం, పనిచేసే చోట పరిస్థితులు... ఇలా సవాలక్ష కారణాలు. భారతీయ సమాజంలో వర్కింగ్ మెన్‌తో పోలిస్తే వర్కింగ్ ఉమెన్‌కు బాధ్యతలు ఎక్కువ. ఆఫీసు తర్వాత ఇంటికి వెళ్లి గృహిణిగా బాధ్యతలు చేపట్టాలి. పిల్లలు, వారి చదువులు, అత్తామామ, వారి ఆలనా పాలనా, ఇలా చాలామంది మహిళలు కెరీర్‌ను వదులుకుంటున్నారు. మహిళలు ఎక్కువగా పనిలో ఒత్తిడికి గురవుతుండడండో కెరీర్లను ఆపేస్తున్నారు. దీన్ని అధిగమించాలంటే ముందుగా చేయాల్సింది ప్రశాంతంగా సొంత నిర్ణయాలు తీసుకోవడమే.

## మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

చాలామంది ఆరోగ్యం అంటే శారీరక ఆరోగ్యమే అనుకుంటారు. మనసును పూర్తిగా నిర్లక్ష్యం చేస్తారు. కానీ మహిళలు మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్న విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రపంచవ్యాప్తంగా కుంగుబాటు, ఆందోళన, ఒత్తిడి, ఆత్మహత్య ఆలోచనలు మొదలైన రుగ్మతలకు గురవుతున్న వారిలో మహిళలే ఎక్కువని రిపోర్టులు వెల్లడిస్తున్నాయి. కుటుంబ సమస్యలు, ఆఫీసులో పనుల కారణంగా మహిళలు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. మానసిక దృఢత్వం తక్కువగా ఉన్న స్త్రీలలో ఇలాంటి ఇబ్బందులు మరీ అధికం. అందుకే కొన్ని కీలకమైన నిర్ణయాలు తీసుకోవాలి. రోజూ కొంత సమయమైనా మన కోసం మనం కేటాయించుకోవాలి. సానుకూల దృక్పథాన్ని అందించే స్నేహితులు, ఆత్మీయులతో సమయాన్ని గడపాలి. శారీరక, మానసిక, లైంగిక వేధింపులకు ఆస్కారం ఇవ్వకూడదు. రోజూ ఓ పది నిమిషాలపాటు ధ్యానం చేయాలి. దీనివల్ల ఆలోచనల మీద పట్టు వస్తుంది. మానసిక సమస్యలు ఇబ్బంది పెడుతుంటే కౌన్సెలర్ లేదా థెరపిస్ట్ సలహా తీసుకోవాలి.

## ఒత్తిడి తగ్గించే కార్యక్రమాల్లో పాల్గొనండి

కేవలం మహిళలను మాత్రమే భాగస్వాములను చేసే టెక్ ఈవెంట్లు, కాన్ఫరెన్స్‌లు జరుగుతూ ఉంటాయి. అలాగే వ్యక్తిత్వ వికాస నిపుణులతో ఉద్యోగాన్ని, కుటుంబ బాధ్యతలను బ్యాలెన్స్ చేసేలా కౌన్సిలింగ్ క్లాసులు నిర్వహిస్తూ ఉంటాయి. అలాంటి వాటికి అటెండ్ కావచ్చు. ప్రపంచ స్థాయి మార్కెట్‌లో పేరొందిన మహిళా సీఈవోలు, కంపెనీ డైరెక్టర్లు, ఇతర కీలక స్థానాల్లో పనిచేసే వారంతా వర్కింగ్ ఉమెన్‌కు సాయపడేందుకు కొన్ని ప్రత్యేకమైన ప్లాట్‌ఫామ్స్ ఏర్పాటుచేశారు. వీటిలో సదస్సులు నిర్వహిస్తూ ఉంటారు. వీటిలో పాల్గొని ఆత్మవిశ్వాసం పెంచుకోవచ్చు.

> మహిళల శ్రమకు, వాళ్లు తీసుకునే ఆహారానికి ఏమాత్రం పొంతన ఉండదు. అందుకే చిన్న వయసులోనే రకరకాల ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. పురుషులతో పోలిస్తే మహిళలకు క్యాలరీలు తక్కువగా, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా అవసరం అవుతాయి. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది... దేశమూ ఆరోగ్యంగా ఉంటుంది.

## ఆహారం విషయంలో జాగ్రత్తలు

ఇల్లు, పిల్లలు, ఉద్యోగం ఇలా రకరకాల బాధ్యతలలో పడిపోయి మహిళలు తిండి గురించి పట్టించుకోవడం మానేస్తున్నారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలనే ఆలోచనే రాదు. మహిళల శ్రమకు, వాళ్లు తీసుకునే ఆహారానికి ఏమాత్రం పొంతన ఉండదు. అందుకే చిన్న వయసులోనే రకరకాల ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. పురుషులతో పోలిస్తే మహిళలకు క్యాలరీలు తక్కువగా, విటమిన్స్, మినరల్స్ ఎక్కువగా అవసరం అవుతాయి. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆరోగ్యంగా ఉంటుంది... దేశమూ ఆరోగ్యంగా ఉంటుంది. ఆమె మాత్రం తన గురించి పట్టించుకోవడం లేదు. హారతి కర్పూరంలా కుటుంబ సేవలో తనను తాను కరిగించుకుంటోంది. ఆహారాన్ని మించిన ఔషధం లేదు. వర్కింగ్ ఉమెన్స్‌కు ఇది మరీ ముఖ్యం. 'ఐ యామ్ నాట్ ఏ డిఫికల్ట్ ఉమన్ ఎట్ ఆల్. ఐ యామ్ ఏ సింప్లి ఏ స్ట్రాంగ్ ఉమన్ అండ్ నో మై వర్త్' అని మనసులో అనుకుని ఆచరిస్తే అలాంటి సవాళ్లనైనా ఇట్టే ఎదుర్కోవచ్చు.

## ఆర్థిక స్వాతంత్ర్యాన్ని వదులుకోవద్దు

ఉద్యోగాలు చేస్తున్నా, వ్యాపారాలు నిర్వహిస్తున్నా చాలామంది మహిళలు ఆర్థిక విషయాల్లో పురుషులపైనే ఆధారపడుతున్నారు. స్వతంత్రంగా వ్యవహరించే ప్రయత్నం చేసినా భర్తపిల్లలు నిరుత్సాహ పరుస్తున్నారు. మరోవైపు ఖర్చు తప్ప పొదుపు తెలియని మహిళలూ ఉన్నారు. వీళ్లంతా కొత్త సంవత్సరం నుంచి అయినా ఆర్థిక ప్రణాళిక, దీర్ఘకాలిక లక్ష్యం వైపు అడుగులు వేయాలి.

ఆర్థిక విషయాలు పురుషులకు మాత్రమే సొంతం అనే భావనను పక్కనబెడితే మహిళలు కూడా ఆర్థిక విషయాల్లో విజయం సాధించగలరు. బాగా చదువుకొని ఉద్యోగాలు చేసే మహిళలు కూడా ఆర్థిక విషయాలు అనే సరికి వెనక్కిపోతారు. అలా భయపడే అవసరమే లేదు. ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ అవుతూ ఉండాలి. సామాజికంగా ఉండే పరిమితుల్ని దాటి మన ఆలోచనలు మార్చుకోవాలి. ముఖ్యంగా తమ పట్ల నమ్మకం కలిగివుండాలి. మహిళలు ఈ

విధంగా ఆర్థిక స్వాతంత్ర్యం కలిగివున్నప్పడే జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కోగలరు. స్థిరమైన వ్యక్తిత్వాన్ని కలిగి సమాజంలో ధైర్యంగా ఉండగలరు. సమాజంలో తమకంటూ ఒక స్థానాన్ని సంపాదించగలరు. ఇంటర్నెట్ పుణ్యమా అని ఉపాధి అవకాశాలు విస్తృతం అయ్యాయి. పెయింటింగ్స్, కుట్టు, అల్లికలు, హోమ్ చెఫ్, ట్యూషన్ల ద్వారా ఎంతో కొంత ఆర్జించే అవకాశం ఉంది. వర్క్ ఫ్రమ్ హోమ్ కూడా ఓ వరమే. సంపాదన ఆత్మ విశ్వాసాన్ని ఇస్తుంది. సమాజంలో ఓ గుర్తింపును తెస్తుంది. జీవన నాణ్యతను పెంచుతుంది. వృద్ధాప్యంలో ఆసరాగా నిలబడుతుంది.

★



మహిళలు ఈ విధంగా ఆర్థిక స్వాతంత్ర్యం కలిగివున్నప్పుడే జీవితంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా సమర్థవంతంగా ఎదుర్కోగలరు. స్థిరమైన వ్యక్తిత్వాన్ని కలిగి సమాజంలో ధైర్యంగా ఉండగలరు. సమాజంలో తమకంటూ ఒక స్థానాన్ని సంపాదించగలరు. ఇంటర్నెట్ పుణ్యమా అని ఉపాధి అవకాశాలు విస్తృతం అయ్యాయి. పెయింటింగ్స్, కుట్టు, అల్లికలు, హోమ్ చెఫ్, ట్యూషన్ల ద్వారా ఎంతోకొంత ఆర్జించే అవకాశం ఉంది. వర్క్ ఫ్రమ్ హోమ్ కూడా ఓ వరమే. సంపాదన ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. సమాజంలో ఓ గుర్తింపును తెస్తుంది.


# భిక్షాటన నుంచి ఎంబిబిఎస్ స్థాయికి..




పేదరికం జీవితానికే కానీ చదువుకు కాదు. వీధిలో భిక్షాటన చేస్తూ, చెత్తకుండీల నుండి ఆహారాన్ని ఏరుకుని తింటూ గడిపిన ఓ చిన్నారి నేడు డాక్టర్‌గా మారింది. హిమాచల్ ప్రదేశ్‌లోని టిబెటన్ శరణార్థుల శిబిరంలో ఉన్న పింకీ హర్యాన్ విజయ గాథ ఇది.

హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రా జిల్లా మెక్‌లియోడ్‌గంజ్‌లో నిరుపేద కుటుంబంలో జన్మించిన పింకీ హర్యాన్ తన బాల్యాన్ని తల్లిదండ్రులతో కలిసి వీధిలో భిక్షాటన చేస్తూ గడిపింది. ధర్మశాలలోని ఒక స్వచ్ఛంద సంస్థకు డైరెక్టర్‌గా ఉన్న లోబ్సెంగ్ జమ్యాంగ్ అనే టిబెటన్ సన్యాసి ఆ చిన్నారిని చేరదీసి శరణార్థి శిబిరంలో చేర్పించాడు. అలా పింకీ జీవితానికి ఒక అండ దొరికింది. అంతే ఇక ఎదురు చూడలేదు. చదువులో ఎప్పుడూ ముందుంటూ పీయూసీ పూర్తి చేసి నీట్ మెడికల్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించింది. 2018లో చైనాలోని ప్రతిష్ఠాత్మక మెడికల్ యూనివర్సిటీలో అడ్మిషన్ పొంది ఎంబీబీస్ డిగ్రీ పూర్తి చేసింది. జమ్యాంగ్ సంకల్పం పింకీ విజయానికి పునాది వేసింది. పిల్లలను నేర్చుకోవడం ప్రేరేపించడం, అది అందించే అవకాశాలను చూపించడం చేస్తూవుంటే ఖచ్చితంగా వారి జీవితంలో అనూహ్యమైన మార్పు వస్తుందనడానికి పింకీ విజయమే ఓ ఉదాహరణ.

పింకీ విజయం అంత సులభంగా దక్కలేదు. ఆమె చాలా పేదరికంలో పెరిగినందున తన పరిస్థితులను ఎవరో నిర్వచించడానికి, తన కోసం తన ఆకాంక్షలను వదులుకోవడానికి ఆమె నిరాకరించడం ఆమె విజయగాథకు నాంది పలికింది. విద్య తన విజయానికి ప్రాథమికమని ఆమె విశ్వసించింది. దృఢసంకల్పం, కృషి ఉంటే అత్యంత భయంకరమైన అడ్డంకులను అధిగమించవచ్చునని నిరూపించింది. ★




## హక్కులపై అవగాహన.. చైతన్య జ్వాలకు ఆలంబన


# ఆరోగ్యం ఆమె హక్కు

**త**నకు తాను ఆరోగ్యంగా ఉండాలనుకోవడం, తగిన పౌష్టికాహారాన్ని స్వీకరించాలనుకోవడం, అనారోగ్య సమయంలో వైద్య సేవలను పొందడం - మహిళల హక్కుల్లో ముఖ్యమైన భాగం. ఈ విషయాన్ని ప్రపంచంలోని ప్రతి మహిళా గుర్తించాలనే ఉద్దేశంతో ప్రతి ఏటా ఇంటర్నేషనల్ డే ఆఫ్ యాక్షన్ ఫర్ ఉమెన్ హెల్త్‌ను జరుపుతారు. ఈ సందర్భంగా ప్రతి మహిళ తన ఆరోగ్య సంరక్షణ కోసం అవగాహన పెంచుకోవడంతో పాటు హక్కుగా ఎలా భావించాలో తెలుసుకోగలగాలి. మహిళల ఆరోగ్య సంరక్షణలో ఎదురవుతున్న ఇబ్బందులు, అందుబాటులో ఉన్న అవకాశాలను తెలియజేసే ముఖ్యమైన వేడుకగా ఈ రోజును భావించాలి. మహిళల ఆరోగ్య సంరక్షణలో అసమానతలను తొలగించడానికి లాటిన్ అమెరికన్, కరీబియన్ ఉమెన్ హెల్త్ నెట్‌వర్క్ 1987లో గ్లోబల్ నెట్‌వర్క్‌ను ఏర్పాటుచేశారు. ఆరోగ్య సంరక్షణలో మహిళల తక్షణ అవసరాలను గుర్తించడానికి ఈ నెట్‌వర్క్ ఆవిర్భవించింది. మహిళల ఆరోగ్య సేవలు, హక్కులలో నిరంతరంగా వచ్చే అవాంతరాలను పరిష్కరించడంతో పాటు మరింత పటిష్టమైన ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను సాధించాలనేది ఈ నెట్‌వర్క్ ఉద్దేశం. మొదట పునరుత్పత్తి,

ప్రసూతి సమయాల్లో సురక్షితమైన ఆరోగ్య సేవలను పొందడంపై దృష్టి సారించడానికి ఈ రోజును కేటాయించారు. ప్రపంచంలో 30 ఏళ్ల క్రితం ప్రసూతి మరణాలు అధికంగా ఉండటంతో తొలుత వాటిపైన దృష్టి సారించాల్సిన అవసరం ఏర్పడింది. ఆ తర్వాత స్త్రీల మానసిక ఆరోగ్యం, హెచ్ఐవి, గర్భనిరోధక సాధనాలు, నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు, ఆర్థిక, సామాజిక కారకాల ప్రభావం వంటి విస్తృత శ్రేణి అంశాలను చేర్చే దిశగా క్రమంగా విస్తరణ జరిగింది. ఒక విధంగా చెప్పాలంటే ఈ అవగాహన అంతర్జాతీయ స్థాయిలో మహిళల ఆరోగ్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రపంచ బ్యాంకు వంటి అంతర్జాతీయ సంస్థలు ఆరోగ్య సేవలను మెరుగుపరచడానికి సెమినార్లు, శిక్షణ, పరిశోధన కార్యక్రమాలను స్పాన్సర్ చేశాయి. నిధుల పెట్టుబడిని ప్రోత్సహిస్తూ 'సురక్షిత మాతృత్వం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టాయి. 1987 మే 28 నుంచి ఇప్పటివరకు ప్రతి ఏటా ఓ ప్రత్యేక ప్రాధాన్యతను కల్పిస్తూ అనేక ప్రభుత్వాలు, అంతర్జాతీయ సంస్థలు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న బహుళజాతి సంస్థలు మహిళల ఆరోగ్యం కోసం తమ చేయూతను అందిస్తున్నాయి. ఎవరూ ఏమాత్రం పట్టించుకోని హాని కలిగించే వ్యాధులతో సహా ప్రపంచవ్యాప్తంగా మహిళలను ప్రభావితం చేసే క్లిష్టమైన ఆరోగ్య సమస్యలను చర్చకు తెస్తూ వాటిపై అవగాహన కల్పిస్తోంది. బహిరంగ సమావేశాల ద్వారా ఈ సమస్యలను వెలుగులోకి తెస్తూ మహిళల ఆరోగ్య సంబంధిత విద్యలను ప్రోత్సహిస్తోంది.

ఇక మహిళల ఆరోగ్య హక్కుల కోసం వాదించడానికి, ఆరోగ్య సంరక్షణలో జెండర్ సమానత్వాన్ని ప్రోత్సహించే విధానాల అమలుకు అవసరమైన కార్యక్రమాల ఆవశ్యకతను నొక్కి చెప్పడానికి ఇదొక వేదికగా ఉపయోపడుతుంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలనుంచి మహిళల ఆరోగ్య న్యాయవాదులు, సంస్థలు, కమ్యూనిటీలను ఒకచోట చేర్చి, వారిలో సంఘీభావాన్ని పెంపొందిస్తుంది. ఈ సమిష్టి చర్య మహిళల ఆరోగ్య హక్కులకోసం చేసే ఉద్యమాలను బలపరుస్తుంది. మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించడం ద్వారా ఆరోగ్యం, శ్రేయస్సుపై బాధ్యత వహించడానికి ప్రత్యేకంగా కేటాయించబడిన ఈ కార్యక్రమం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని, శక్తిని పెంచుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. స్థానిక, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో మహిళల ఆరోగ్యం, హక్కులను ప్రోత్సహించే కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయగలగాలి.

ప్రపంచంలోని ప్రతి వ్యక్తి ఆర్థిక, సామాజిక, సాంస్కృతికంగా లభించే హక్కుల కోసం ఉద్దేశించబడినవే మానవ హక్కులు. ప్రపంచ సమాజంలో పౌర, రాజకీయ హక్కులకు సంబంధించి అంతర్జాతీయ ఒప్పందంపై అవగాహన కల్పించడానికి 1948 నుంచి ప్రతి ఏటా డిసెంబర్ 10న 'అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం' నిర్వహిస్తున్నారు. అయితే 1945లో




# సమాన వేతనం మహిళల ప్రాథమిక హక్కు

రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాతే మానవ హక్కుల దినోత్సవం జరపాలన్న సూచనలు వచ్చాయి. శాంతి నెలకొల్పాలన్న ఆకాంక్ష కూడా ఈ ప్రకటనలో ఇమిడివుంది. ప్రపంచ యుద్ధం తర్వాత అనేక సోషలిస్టు ప్రజాస్వామ్య దేశాల ఆవిష్కరణ జరిగింది. అయినా వివిధ దేశాల్లో మానవ హక్కుల హననం నేటికీ జరుగుతూనే వుంది. శాస్త్ర సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన ఈ ఆధునిక యుగంలోనూ నిరంకుశ పాలకులు, ప్రభుత్వాలు ప్రజల హక్కులను హరించడం పరిపాటిగా మారిపోయింది. ఈ దురాగతాలను అరికట్టి మానవ హక్కుల రక్షణకు 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్య సమితి సార్వజనీన మానవ హక్కుల ప్రకటనను ఆమోదించింది. భారత స్వాతంత్ర్య సమరయోధుడు డాక్టర్ హన్స్ జీవరాజ్ మెహతాతో పాటు వివిధ దేశాలు, సైద్ధాంతిక భావజాలాలకు చెందిన మేధావులంతా కలిసి ఈ ప్రకటనను రూపొందించారు. అప్పటినుంచి ఏటా డిసెంబర్ 10న ప్రపంచ మానవ హక్కుల దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి నిర్వహిస్తోంది. ఐరాస మానవ హక్కుల ప్రకటన భారత్ సహా పలు దేశాల రాజ్యాంగాలకు స్ఫూర్తినిస్తోంది. ఐరాసలోని సభ్య దేశాల పౌర, సామాజిక, రాజకీయ సాంస్కృతిక మతపరమైన హక్కుల రక్షణకు అంతర్జాతీయ అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ఈ ప్రకటన పునాదిగా ఉపయోగపడుతోంది. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంపై అన్ని సభ్య దేశాలను, సంస్థలను ఆహ్వానించి సాధారణ సభ 423(ఐ) తీర్మానానికి ఆమోదం తెలిపింది. అప్పటినుంచి అన్ని దేశాలూ డిసెంబర్ 10న మానవ హక్కుల దినోత్సవం పాటించడం ఆనవాయితీగా వస్తోంది. 1993లో మానవ హక్కుల అభివృద్ధి, పరిరక్షణ కోసం ఒక హైకమిషనర్‌ను కూడా ఐరాస నియమించింది. మానవ హక్కులు కేవలం స్వేచ్ఛ,

స్వాతంత్ర్యాలకు మాత్రమే సంబంధించింది కాదు. సార్వత్రిక, సమసమాజ శైలికి సంబంధిం చింది. అటువంటి హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాల పైనే ఉంది. మానవ హక్కుల ఉద్యమం 1970వ దశకంలో ప్రారంభమైంది. ప్రభుత్వాలు, పాలకులు నిరంకుశ ధోర ణితో ఉన్నప్పడే ఈ ఉద్యమాలు ప్రారంభమవుతాయి. భారత్‌లో మానవ హక్కుల పరిరక్షణ చట్టాన్ని 1993లో ఆమోదించారు. అప్పటి ప్రధాని పి.వి.నరసింహారావు 1993 అక్టోబర్ 12న మానవ హక్కుల కమిషన్‌ను ఏర్పాటుచేశారు. ఈ కమిషన్ చట్టబద్ధమైన స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థ అయినప్పటికీ రాజ్యాంగబద్ధత లేదు. ఆ తర్వాత ఈ చట్టాన్ని 2006లో సవరించి కొన్ని మార్పులు చేశారు. మానవుడు తన మనుగడను సక్రమంగా సాగించడానికి అనేక హక్కులు తోడ్పడతాయి. మానవుడి జీవనాభివృద్ధికి ఈ హక్కులు దోహదపడతాయి. మానవ హక్కుల పరిరక్షణకు సంబంధిత కమిషన్ బాధ్యత వహిస్తుంది.

ప్రపంచంలో జన్మించిన ప్రతి మనిషి స్వతంత్రంగా జీవించేందుకు కొన్ని హక్కులు ఉంటాయి. కానీ అనేక సందర్భాల్లో ఆ హక్కులను ఎవరూ గౌరవించడం లేదు. సాటి మనిషిని మనిషిగా పరిగణించని సందర్భాలు కూడా ఉన్నాయి. మరికొన్ని సందర్భాల్లో సమాజం కూడా ఈ హక్కులను హరించేందుకు కారణమవుతోంది. పరువు హత్యలు, జాతి వివక్ష హత్యలు, అత్యాచార ఘటనలు, సంఘ భవిష్కరణలు - అనేక రకాల ఘటనలు నిత్యం జరుగుతూనే



# మహిళల సాధికారతకు పురుషాధిక్యతే అడ్డు

ఉన్నాయి. జాతి, భాష, కుల మతాల జాడ్యాన్ని వీడకపోవడంతో మానవ విలువలు దిగజారిపో తున్నాయి. సమాజంలోని కొందరు ఉన్నత వర్గీయులు మిగతా వారికన్నా తాము అధికులమనే దురహంకారం మానవ హక్కుల ఉల్లంఘనకు దారితీస్తోంది. ఈ ఆధిపత్య వాదమే బాని సత్వం, అస్పృశ్యత, జాతి, లింగ, మత, భాషాపరమైన అమానుషాలకు కారణమవుతోంది. 1857లో 'డ్రెడ్ స్కాట్ వర్సెస్ శాండ్‌ఫోర్డ్ కేసులో అమెరికా సుప్రీంకోర్టు అక్కడి నల్లజాతీ యులు దేశ పౌరులు కాదని తీర్పు చెప్పిందంటే జాత్యంహకారం ఎంతగా జీర్ణించుకుపో యిందో అర్థం చేసుకోవచ్చు. అనంతరకాలంలో 1886లో అదే కోర్టు అమెరికా కంపెనీలకు దేశ పౌరసత్వం కల్పించింది. అమెరికాలో నల్లజాతీయుల కంటే ముందు గా కంపెనీలకు పౌరసత్వ హక్కులు లభించడం గమనార్హం. మనుషుల కన్నా కంపెనీలే అధికమంటున్న ఆ తీర్పు కంటే దారుణం మరొకటి లేదు. ఇటువంటి దురాగతాలను నివారించడానికి, మనుష లంతా సమానులేనని తెలియజేయడానికే ఐరాస మానవ హక్కుల ప్రకటనకు ప్రాణం పోసు కుంది. మానవ హక్కులన్నీ ప్రాథమిక హక్కులే. వాటిని ఎవరూ హరించలేరు. ప్రతి వ్యక్తి ఎలాంటి వివక్షకూ గురికాకుండా, గురిచేయకుండా ప్రశాంతంగా జీవించడమే మానవ హక్కుల సార్వజనీన ప్రకటన ప్రధాన ఉద్దేశం. జాతి, మత, రాజకీయ, వ్యక్తిగత కారణాలతో ఎవరినీ ఇబ్బందులపాలు చేయరాదు, గురిచేయరాదనేదే దీని లక్ష్యం.

### ప్రధాన లక్ష్యాలు

1. జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ, ఇతర కారణాలతో వివక్ష లేని జీవనం.
2. చిత్రహింసలు, క్రూరత్వం నుంచి బయటపడటం.
3. వెట్టిచాకిరీ, బానిసత్వం వంటి దురాచారాల నుంచి రక్షణ
4. నిర్బంధం లేని జీవన విధానం
5. స్వేచ్ఛగా ఎక్కడికైనా పర్యటించే హక్కు
6. సురక్షిత ప్రాంతాల్లో జీవించే హక్కు
7. బలవంతపు పనుల నుంచి విముక్తి
8. విద్యా హక్కు ద్వారా పిల్లలకు స్వేచ్ఛ
9. భావ ప్రకటన, స్వాతంత్ర్యపు హక్కు
10. ఏ మతాన్నైనా స్వీకరించే హక్కు

ఈ హక్కులకు ఎవరు ఎలాంటి విఘాతం కల్పించినా, కలిగినా బాధితులు ప్రత్యేక కోర్టులు, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించవచ్చు. రాజ్యాంగంలోని నియమ నిబంధనలు మానవ హక్కుల పరిరక్షణకు దోహదపడతాయి.

★

## సురక్షిత గర్భం, శిశు జననానికి

# పౌష్టికాహారమే ఔషధం

ఆరోగ్యం మరియు అభివృద్ధిలో పోషకాహారం చాలా కీలకం. మెరుగైన పోషకాహారం శిశువు, బిడ్డతో పాటు తల్లి ఆరోగ్యం, బలమైన రోగనిరోధక వ్యవస్థలు, సురక్షితమైన గర్భం మరియు శిశు జననానికి పోషకాహారం పాత్ర అత్యవసరం. అంతేకాకుండా నాన్ కమ్యూనికబుల్ వ్యాధులు (మధుమేహం, హృదయ సంబంధ వ్యాధులు వంటివి) దరిచేరకుండా దీర్ఘాయువుకు పౌష్టికాహారం చాలా దోహదపడుతుంది.

ఆరోగ్యకరమైన పిల్లలు చాలా తేలికగా బాగా నేర్చుకుంటారు. తగినంత పోషకాహారం ఉన్న వ్యక్తులు మరింత ఉత్పాదకతను కలిగివుంటారు. పేదరికం, ఆకలి యొక్క మూలాలను క్రమంగా విచ్ఛిన్నం చేసే అవకాశాలను సృష్టించడంలో కీలకపాత్ర పోషిస్తారు.

పోషకాహార లోపం మానవ ఆరోగ్యానికి ప్రతి రూపంలోనూ ముఖ్యమైన ముప్పను తీసుకొస్తుంది. పోషకాహార లోపం యొక్క రెట్టింపు భారాన్ని ప్రపంచం నేడు ఎదుర్కొంటోంది. ఇందులో పోషకాహార లోపం మరియు అధిక బరువు రెండూ ఉన్నాయి. ముఖ్యంగా తక్కువ మరియు మధ్య ఆదాయ దేశాలలో పోషకాహార లోపం, తగిన విటమిన్లు లేదా ఖనిజాలు లేని ఆహారం, అధిక బరువు, స్థూలకాయం, మధుమేహం, గుండె సంబంధ వ్యాధులు సహా పోషకాహార లోపం బహుళ రూపాల్లో అన్ని వయసుల వారికి ఆరోగ్య సమస్యలను తెచ్చిపెడుతోంది. ఒక్క పోషకాహార లోపం వల్ల యావత్ ప్రపంచం అభివృద్ధి, సామాజిక మరియు వైద్యపరమైన ప్రభావంతో పాటు వ్యక్తులు, వారి కుటుంబాలు, పిల్లలు, సంఘాలకు, దేశాలకు తీవ్రమైన సమస్యలను తెచ్చిపెట్టడంతో పాటు శాశ్వతంగా మారబోతున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు వున్న 149.2 మిలియన్ల పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతుండగా, , 45.4 మిలియన్ల వ్యక్తులు వారి ఎత్తుకు తగిన బరువు లేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నట్లు తాజాగా వెల్లడైంది. ఎత్తుకు తగిన బరువు లేని పిల్లల శాతంలో మూడొంతులమంది ఆసియాలో నివసిస్తున్నారు. ఐదు సంవత్సరాల లోపు వయసున్న పిల్లల్లో 45 శాతం మరణాలు పోషకాహార లోపంతో ముడిపడి వున్నాయి. ఇవి తక్కువ ఆదాయ మరియు మధ్య ఆదాయం కలిగిన దేశాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి.

రక్తహీనత విషయానికి వస్తే ఇది తీవ్రమైన ప్రపంచ ఆరోగ్య సమస్య. ఇది ముఖ్యంగా చిన్నపిల్లలు మరియు గర్భిణులపై విపరీత ప్రభావాన్ని చూపుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లల్లో 40శాతం మంది, గర్భిణులలో 37 శాతం రక్తహీనతతో బాధపడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది. పునరుత్పత్తి వయస్సు గల స్త్రీలలో 30 శాతం మందికి రక్తహీనత ఉంది. ప్రపంచవ్యాప్తంగా 1.9 బిలియన్ పెద్దలు అధిక బరువు మరియు ఊబకాయంతో సతమతమవుతున్నారు. ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయసున్న 38.9 మిలియన్ల పిల్లలు అధిక బరువుతో ఉన్నారు. బాల్యంలో అధిక బరువు మరియు ఊబకాయంతో ఇబ్బందిపడేవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. మరీ ముఖ్యంగా ధనిక, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. తల్లి పాలు, పోషకాహార లోపం మరియు అధిక బరువు నుండి తల్లి పాలు రక్షిస్తున్నప్పటికీ ఆరు నెలల కంటే తక్కువ వయసున్న శిశువుల్లో కేవలం 44 శాతం మాత్రమే తల్లిపాలు అందిస్తారు. అధిక సోడియం వినియోగం (ప్రతి రోజూ ఐదు గ్రాముల మించి ఉప్పు తీసుకోవడం) అధిక రక్తపోటుకు దోహదం చేస్తుంది. గుండెజబ్బులు, స్ట్రోక్ ప్రమాదాన్ని పెంచుతుంది. చాలామంది ఉప్పును ఎక్కువగా తీసుకుంటారు. సగటున 9 నుంచి 12 గ్రాములు తీసుకుంటే గరిష్ఠ స్థాయి కన్నా రెండు రెట్లు ఎక్కువ.

2016 - 2025 పోషకాహార వ్యూహం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా పోషకాహార అత్యవసరాన్ని ముందుకు తీసుకువెళ్లే ప్రాధాన్యతలను, విధానాలను అమలుచేయడం, సమలేఖనం చేయడం మరియు పోషకాహార లోపాన్ని అధిగమించడంలో సహాయం చేయడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ తన శక్తినంత ఉపయోగిస్తోంది. బలమైన, శాస్త్రీయ మరియు నైతిక ఫ్రేమ్‌వర్క్‌ల ఆధారంగా సమాచార మార్గదర్శకాన్ని అభివృద్ధి చేస్తుంది. సమర్థవంతమైన పోషకాహార చర్యల మార్గదర్శకత్వం మరియు అమలును స్వీకరించడానికి మద్దతు ఇస్తుంది. విధానపరమైన నిర్ణయాల అమలు, పోషకాహార ఫలితాలను పర్యవేక్షించడంతో పాటు మూల్యాంకనానికి కూడా ప్రాధాన్యతనిస్తోంది.

2012లో ప్రపంచ ఆరోగ్య అసెంబ్లీ తీర్మానం ద్వారా సభ్య దేశాలు ఆమోదించిన మాతా, శిశు మరియు చిన్నపిల్లల పోషణపై సమగ్ర అమలు ప్రణాళిక ద్వారా ఈ పని రూపొందించబడింది. ఆహార సంబంధిత లక్ష్యాలను సాధించడానికి, పోషకాహార లోపాన్ని అంతం చేసే చర్యలు చాలా ముఖ్యమైనవి. వీటికి ప్రపంచ దేశాలు సానుకూలంగా స్పందించి తక్షణ చర్యలకు రూపకల్పన చేయాలి. నాన్ కమ్యూనికేషన్ వ్యాధుల నివారణ మరియు నియంత్రణ కోసం ప్రణాళిక 2013-2020, మహిళలు, పిల్లలు మరియు కౌమారదశకు సంబంధించిన గ్లోబల్ స్ట్రాటజీ 2026-2030, బాలల్లో స్థూలకాయాన్ని అంతం చేసే కమిషన్ నివేదిక

(2016), మరియు స్థిరమైన అభివృద్ధి కోసం 2030 ఎజెండా.

### అత్యవసర పరిస్థితుల్లో పోషకాహారాన్ని పరిష్కరించడం

శరణార్థులు మరియు స్థానచలనం చెందిన జనాభాలో ఆకలి మరియు పోషకాహార లోపం ప్రబలంగా ఉంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 40 మిలియన్ల మంది ప్రజలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో చాలామంది - శిశువులు, పిల్లలు, కౌమారదశలు, పెద్దలు మరియు వృద్ధులు - ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. అయోడిన్, విటమిన్ -ఎ మరియు ఇనుము యొక్క లోపాలు అత్యవసర - ప్రభావిత జనాభాలో సాధారణం. అత్యవసర పరిస్థితుల్లో పోషకాహార లోపం యొక్క ప్రమాద స్థాయిలు, పౌరభద్రత స్థాయి, ఆహార లభ్యత, ఆరోగ్య సేవలు, సహాయ పంపిణీ వంటి అంశాలపై ఆధారపడి వుంటుంది.

# అటు సంక్షోభాలు... ఇటు ఆకలి కేకలు

ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాల మధ్య యుద్ధాలు, యుద్ధ వాతావరణం, ఇతరత్రా కారణాల వల్ల గత ఏడాది ఆకలికి అల్లాడిన వారి సంఖ్య గణనీయంగానే పెరిగింది. ఐదు ఐక్యరాజ్యసమితి ప్రత్యేక ఏజెన్సీలు ప్రచురించిన తాజా గణాంకాలు ఈ వాస్తవాన్ని వెల్లడిస్తున్నాయి. స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ది వరల్డ్ నివేదిక ప్రకారం 2023లో దాదాపు 733 మిలియన్ల ప్రజలు ఆకలి బాధను ఎదుర్కొన్నారు. అంటే ప్రపంచవ్యాప్తంగా ప్రతి పదకొండు మందిలో ఒకరు ఆకలి బాధకు గురయ్యారు. ఆఫ్రికాలో అయితే ప్రతి ఐదుగురిలో ఒకరు ఆకలి బాధను ఎదుర్కొన్నారు. 2023లో 757 మిలియన్ల ప్రజలు పోషకాహార లోపంతో దాదాపు 152 మిలియన్ల ప్రజలు ఆహార అభద్రత, పోషకాహార లోపాన్ని ఎదుర్కొన్నారు. ఆఫ్రికాలో ఆకలిని ఎదుర్కొంటున్న జనాభా శాతం (20.4) పెరుగుతూనే ఉంది. 8.1 శాతంతో ఆసియా స్థిరంగా ఉంది. అయినప్పటికీ ఈ ప్రాంతం ఆకలిని ఎదుర్కొంటున్న వారిలో సగానికి పైగా ఉన్నందున ఇప్పటికీ గణనీయమైన సవాలుగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా మరియు లాటిన్ అమెరికా 6.2 శాతంతో పురోగతిని చూపుతోంది. అయితే 20922 నుండి 2023 వరకు పశ్చిమ ఆసియా, కరేబియన్ మరియు చాలా ఆఫ్రికన్ ఉప ప్రాంతాలలో ఆకలిని ఎదుర్కొన్న వారి సంఖ్య పెరిగింది.

# ఆకలిని మించిన కీలక ఫలితాలు

బిలియన్ల మందికి సరిపడా ఆహారాన్ని పొందడం అస్పష్టంగానే ఉందని ఈ నివేదిక ప్రత్యే కంగా ప్రస్తావించింది. 2023లోప్రపంచవ్యాప్తంగా సుమారు 2.23 బిలియన్ల మంది ప్రజలు మితమైన లేదా తీవ్రమైన ఆహార అభద్రతను ఎదుర్కొన్నారు. ఈ సంఖ్య 202లో కోవిడ్ మహ మ్మారి మధ్య తీవ్ర పెరుగుదల తర్వాత గణనీయంగా మారలేదు. వారిలో 864 మిలియన్ల మంది ప్రజలు తీవ్రమైన ఆహార అభద్రతను అనుభవించారు. ఒకరోజు మొత్తం లేదా కొన్ని సమ యాల్లో ఆహారం లేకుండా ఉన్నారు. ఈ సంఖ్య 2020 నుండి మొండిగా ఎక్కువగానే ఉంది. మరియు లాటిన్ అమెరికా అభివృద్ధిని చూపుతున్నప్పటికీ, విస్తృత సవాళ్లు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆఫ్రికాలో 58 శాతం జనాభా మధ్యస్తంగా లేదా తీవ్రంగా ఆహార అభద్రతతో ఉన్నారు.

ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మందిని ప్రభావితం చేసే ఆరోగ్యకరమైన ఆహా రాలకు ఆర్థిక వనరులు సరిపోకపోవడం కూడా ఒక క్లిష్టమైన సమస్యగా మారింది. కొత్త ఆహార ధరల డేటా మరియు మెథడాలజికల్ మెరుగుదలతో 2022లో 2.8 బిలియన్లకు పైగా ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని పొందలేకపోయారని ప్రచురణ వెల్లడించింది. ఈ అసమాత తక్కువ ఆదాయ దేశాలలో ఎక్కువగా కనిపిస్తోంది. ఇక్కడ జనాభాలో 71.5 శాతం మంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేరు, అధిక ఆదాయ దేశాల్లో 6.3 శాతంతో పోలిస్తే. ముఖ్యంగా ఈ సంఖ్య ఆసియా మరియు ఉత్తర అమెరికా మరియు ఐరోపా దేశాల్లో ప్రీ పాండమిక్ స్థాయిల కంటే పడిపోయింది. అయితే ఇది ఆఫ్రికాలో గణనీయంగా పెరిగింది.

శిశువులకు ప్రత్యేకమైన తల్లిపాలను 48 శాతానికి పెంచడంలో పురోగతి సాధించినప్ప టికీ, ప్రపంచ పోషకాహార లక్ష్యాలను సాధించడం ఒక సవాలుగా మారుతోంది. తక్కువ బరు వుతో జన్మించిన శిశువుల ప్రాబల్యం 15 శాతం స్తబ్దుగా ఉంది. ఐదేళ్లలోపు పిల్లల్లో 22.3 శాతా నికి తగ్గినప్పటికీ లక్ష్యాలను మాత్రం చేరుకోలేకపోతోంది. అదనంగా 15 నుండి 49 సంవత్స రాల వయసు గల మహిళల్లో రక్తహీనత పెరిగింది. అదేవిధంగా వయోజన ఊబకాయం యొక్క కొత్త అంచనాలు గత దశాబ్దంలో 12.1 శాతం (2012) నుండి 15.8 శాతానికి (2022) స్థిరమైన మెరుగుదలను చూపుతున్నాయి. 2030 నాటికి ప్రపంచంలో 1.2 బిలియన్ల కంటే ఎక్కువ ఊబకాయం ఉన్న పెద్దలు ఉంటారని అంచనాలు సూచిస్తున్నాయి. పోషకా హార లోపం యొక్క రెట్టింపు భారం - అధిక బరువు మరియు ఊబకాయంతో పాటు పోషకా హార లోపం యొక్క ఉనికి అన్ని వయసుల వారిలోనూ ప్రపంచవ్యాప్తంగా పెరిగింది. గత రెండు దశాబ్దాల్లో సన్నబడటం మరియు తక్కువ బరువు తగ్గుముఖం పట్టగా ఊబకాయం బాగా పెరిగింది. ఈ పోకడలు పోషకాహార లోపం యొక్క అన్ని రూపాల్లోని సంక్లిష్ట సవా

ళ్లను నొక్కిచెబుతున్నాయి. 2030 నాటికి ప్రపంచం ఏడు పోషకాహార లక్ష్యాలలో దేనినైనా చేరుకోవడానికి మార్గం లేనందున లక్ష్య సాధన యొక్క తక్షణ అవసరాన్ని ఐక్యరాజ్యసమితికి చెందిన ఐదు ఏజెన్సీలు నొక్కిచెబుతున్నాయి.

ఆహార భద్రత మరియు పమోషకాహార లోపం అనేక దేశాలలో అనేకమందికి ఆర్థిక లాభాలను దెబ్బతీస్తూ కొనసాగుతున్న ఆహార ధరల ద్రవ్యోల్బణంతో సహా కారకాల కలయిక కారణంగా తీవ్రమవుతున్నాయి. సంఘర్షణ, వాతావరణ మార్పు మరియు ఆర్థిక మాంద్యం వంటి ప్రధాన సమస్యలు మరింత తరచుగా, అప్పుడప్పుడు తీవ్రంగా పరిణమిస్తున్నాయి. ఈ సమస్యలు భరించలేని ఆరోగ్యకరమైన ఆహారాలు, అనారోగ్యకరమైన ఆహార వాతావరణాలు మరియు నిరంతర అసమానత వంటి అంతర్లీన కారకాలతో పాటు ఇప్పుడు ఏకకాలంలో వాటి వ్యక్తిగత ప్రభావాలను పెంచుతున్నాయి.

## ఆకలి అంతానికి ఆర్థిక సహకారం

'ఆకలి, ఆహార భద్రత మరియు అన్ని రకాల పోషకాహార లోపాలను అంతం చేయడానికి ఆర్థిక సహకారం' అనే నినాదంతో ఈ ఏడాది నివేదిక రూపుదిద్దుకుంది. జీరో హంగర్ లక్ష్యాన్ని సాధించడానికి వ్యవసాయ ఆహార వ్యవస్థలను మార్చడం మరియు బలోపేతం చేయడం, అసమానతలను పరిష్కరించడం మరియు సరసమైన ధరలో ఆరోగ్యవంతమైన ఆహారాన్ని నిర్ధారించడం వంటి బహుముఖ విధానం అవసరమని నొక్కిచెప్పింది. అందరికీ ఆహారం - ఇది ఆహార భద్రత మరియు పోషణ కోసం ఆర్థిక వనరులను సమకూర్చడం యొక్క స్పష్టమైన మరియు ప్రామాణికమైన నిర్వచనంతో పెరిగిన మరియు మరింత ఖర్చుతో కూడుకున్న ఫైనాన్సింగ్ కోసం పిలుపునిస్తుంది.

ఆహార భద్రత మరియు పోషణ కోసం కేటాయించే ఆర్థిక వనరుల్లో అంతరాన్ని అంచనావేయడం మరియు దానిని తగ్గించడానికి వినూత్నమైన ఫైనాన్సింగ్ మార్గాలను సమీకరించడం మా ప్రధాన ప్రాధాన్యతలలో ఉండాలి. ఆకలిని అంతం చేయడానికి మరియు ప్రజలందరికీ సురక్షితమైన, పోషకమైన మరియు తగినంత ఆహారం అందుబాటులో ఉండేలా విధానాలు, చట్టం మరియు జోక్యాలకు అన్ని రకాల పోషకాహార లోపాన్ని అంతం చేయడానికి గణనీయమైన వనరుల సమీకరణ అవసరం. అవి భవిష్యత్తులో పెట్టుబడి మాత్రమే కాదు, మన బాధ్యత అని ఐక్యరాజ్యసమితికి చెందిన ఐదు ఏజెన్సీల అధిపతులు నివేదిక ముందుమాటలోనే స్పష్టం చేశారు. ప్రస్తుత మరియు భవిష్యత్తు తరాలకు తగిన ఆహారం మరియు పోషకాహారం పొందే హక్కుకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరాన్ని వారు నొక్కిచెప్పారు. పెరుగుతున్న ఫైనాన్సింగ్ గ్యాప్ వినూత్నమైన, సమానమైన పరిష్కారాలు అవసరమని నివేదిక స్పష్టం చేసింది. ముఖ్యంగా వాతావరణ ప్రభావాలవల్ల అధిక స్థాయి ఆకలి మరియు పోషకాహార

లోపం ఎదుర్కొంటున్న దేశాలకు ఈ సహకారం తక్షణ అవసరమని పేర్కొంది. ఎక్కువ ఫైనా న్సింగ్ అవసరం ఉన్న దేశాలు గణనీయమైన సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.

# తల్లిపాలు.. శిశువుకు నిండు నూరేళ్లు..

పిల్లల ఆరోగ్యం మరియు వారి మనుగడను నిర్ధారించడానికి తల్లిపాలు అత్యంత ప్రభావ వంతమైన మార్గాల్లో ఒకటి. శిశువులకు తల్లిపాలు అనువైన ఆహారం. ఇది సురక్షితమైనది, శుభ్రమైనది మరియు అనేక సాధారణ బాల్య వ్యాధులనుండి రక్షించడంలో సహాయపడే ప్రతి రోధకాలను కలిగివుంటుంది. శిశువు జీవితంలోని తొలి నెలలకు అవసరమైన మేర అన్ని రకాల శక్తిని మరియు పోషకాలను తల్లిపాలు అందిస్తుంది. ఇది మొదటి సంవత్సరం రెండవ అర్ధభా గంలో పిల్లల పోషకాహార అవసరాలలో సగం లేదా అంతకంటే ఎక్కువ మరియు రెండవ సమయంలో మూడవ వంతు వరకు అందించడం జరుగుతుంది. తల్లిపాలు తాగే పిల్లలు తెలి వితేటల పరీక్షల్లో మెరుగ్గా పనిచేస్తారు. అధిక బరువు లేదా ఊబకాయం మరియు తరువాత జీవితంలో మధుమేహం వచ్చే అవకాశం తక్కువ. బాల్యంలో తల్లిపాలు తాగిన స్త్రీలకు భవిష్య త్తులో రొమ్ము మరియు అండాశయ క్యాన్సర్‌లు వచ్చే ప్రమాదం కూడా తగ్గుతుంది. తల్లిపాలకు ప్రత్యామ్నాయంగా వచ్చిన ఉత్పత్తుల అనుచిత మార్కెటింగ్ ప్రపంచవ్యాప్తంగా తల్లిపాల ఆవశ్యక తపై చైతన్యం తీసుకువచ్చే ప్రయత్నాలను బలహీనపరచడం దురదృష్టకరం.

శిశువు జన్మించిన మొదటి గంటలోనే తల్లిపాలు అందించడం ప్రారంభించాలని, మొదటి ఆరునెలల వరకు ప్రత్యేకంగా తల్లిపాలు ఇవ్వాలని అంతర్జాతీయ సంస్థలు సిఫార్సు చేస్తు న్నాయి. నీటితో సహా ఇతర ఆహారాలు లేదా ద్రవాలు శిశువులకు అందించకూడదు. శిశువు ఎన్నిసార్లు కోరుకుంటే అన్ని సార్లు తప్పనిసరిగా తరచుగా ఇస్తూనే వుండాలి. ఇతరత్రా ద్రావ కాలు కానీ, పాలసీసాలు వంటివి అస్సలు ఇవ్వకూడదు. ఆరు నెలల వయసునుండి రెండు లేదా అంతకంటే ఎక్కువ వయసు వరకు తల్లిపాలను కొనసాగిస్తూనే సురక్షితమైన, పరిపూర కమైన ఆహారాన్ని తినిపించడం ప్రారంభించాలి.

శిశువులు, చిన్నపిల్లలకు ఉత్తమ పోషకాహార వనరుగా తల్లిపాలను ప్రపంచ ఆరోగ్య సంస్థ విశేషంగా కృషిచేస్తోంది. 2025 నాటికి మొదటి ఆరు నెలలకు ప్రత్యేకమైన తల్లిపాలను కనీసం 50 శాతం వరకు పెంచడానికి కృషి చేస్తోంది. తల్లిపాల ఆవశ్యకతపై విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ, యునిసెఫ్ సంయుక్తంగా గ్లోబల్ బ్రెస్ట్‌ఫీడింగ్ కలె క్టివ్‌ను ఏర్పాటుచేశాయి. రాజకీయ, చట్టపరమైన, ఆర్థిక మరియు ప్రజల మద్దతు కూడగట్ట

డమే దీని లక్ష్యం. అంతర్జాతీయ సంస్థలు, దాతృత్వ సంస్థలు, ప్రభుత్వాలు, పౌర సమాజం నుండి దాతలను ఒకచోట చేర్చి తల్లిపాల ఆవశ్యకతను ప్రపంచం నలుమూలలా మరింతగా చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి జరుపుతున్నాయి. రొమ్ముపాలు ప్రత్యామ్నాయాలను అనుచితంగా విక్రయించబడకుండా చూసేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నెట్‌వర్క్ చర్యలు తీసుకుంటోంది. అంతేకాకుండా తల్లిపాలు ఇచ్చే బాలింతలకు నైపుణ్యంతో కూడిన సహకారాన్ని అందించడానికి, సమస్యలను అధిగమించడానికి మరియు పిల్లల పెరుగుదలను పర్యవేక్షించడానికి ప్రపంచ ఆరోగ్య సంస్థ తన కార్యకర్తలకు శిక్షణా కోర్సులను అందిస్తుంది.

## *ఆహార నాణ్యత లేదా ఆరోగ్యకరమైన ఆహారం*

*ఇది నాలుగు ముఖ్యాంశాలను కలిగివుంటుంది. వైవిధ్యం, పోషకాల సమృద్ధి, నియంత్రణ (పేలవమైన ఆరోగ్య ఫలితాలకు సంబంధించిన ఆహారాలు మరియు పోషకాలు), సమతుల్యత (శక్తి మరియు సూక్ష్మపోషకాలు). తీసుకునే ఆహారం సురక్షితమైనదిగా ఉండాలి.*

### ఆహార పర్యావరణం

*ఆహారాన్ని పొందడం, తయారుచేయడం మరియు తీసుకోవడం వంటి వాటికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి వినియోగదారులు వ్యవసాయ ఆహార వ్యవస్థలతో నిమగ్నమయ్యే భౌతిక, ఆర్థిక, రాజకీయ మరియు సామాజిక సాంస్కృతిక సందర్భం.*

### ఆకలి

*ఆహారం నుండి తగినంత శక్తిలేకపోవడం వల్ల కలిగే అసౌకర్య లేదా బాధాకరమైన అనుభూతి. ఈ నివేదికలో ఆకలి అనేక పదం దీర్ఘకాలిక పోషకాహార లోపంతో పర్యాయ పదంగా ఉంటుంది.*

### పోషకాహార లోపం

*సూక్ష్మ పోషకాలు లేదా బరువు తగ్గడానికి కారణమయ్యే వ్యాధికారణంగా సరిపోని, అసమతుల్యత లేదా అధికంగా తీసుకోవడం వల్ల ఏర్పడే అసాధారణ శారీరక స్థితి. పోషకాహార లోపంలో విటమిన్లు మరియు సూక్ష్మ పోషకాలు లోపించిన ఆహారం, అధిక బరువు మరియు ఊబకాయం కూడా ఉంటాయి.*

# Form - IV
## (See Rule 8)

Statement about ownership and other particulars of the UDBHAVA Telugu Monthly, Hyderabad, as required under Rule 8 of the Registration of News Paper (Central) Rules, 1956.

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | Hyderabad |
| 2. Periodicity of Publications | : | Monthly |
| 3. Printer's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 4. Publisher's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 5. Editor's Name | : | M. Madhava Vasu |
| Whether Citizen of India? | : | Yes |
| Address | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |
| 6. Name and address of Individuals who own the Newspaper | : | M. Madhava Vasu |
| | : | 1-24-21/4, (24-387), Plot No.1,<br>Sri Sai Nagar, Lothukunta,<br>Alwal, Secunderabad - 500 015 |

I, **M. Madhava Vasu**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

**M. Madhava Vasu**
(Publisher)